
ఈనాడు

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 15 ఆగస్టు 2017 — 16 పేజీలు



- ఊరూరా వ్యాపిస్తున్న దోమలు
- జ్వరాలతో సతమతమవుతున్న ప్రజలు
- పిచికారి, ఫాగింగ్ ఊసే లేదు
- నివారణపై అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం

చేద్దామా! యుద్ధం

ఈనాడు వరంగల్, న్యూస్‌టుడే, ఏటూరునాగారం

దోమలు తీవ్ర స్థాయిలో విజృంభిస్తున్నాయి.. రెప్ప పాటులో రక్తాన్ని పీల్చేస్తున్నాయి.. పట్టణాల నుంచి మారుమూల ఏజెన్సీ గూడేల వరకు వ్యాపించి బెంబేలెత్తిస్తున్నాయి.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి.. రాత్రింబవళ్లు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే వరంగల్ అర్బన్, రూరల్, జనగామ, జయశంకర్, మహబూబాబాద్ జిల్లాల్లో కొందరికి డెంగీ సోకి విలవిల్లాడుతున్నారు.. చాలా మంది మలేరియాతో మంచం పడుతున్నారు. అయినా దోమలపై అధికారులు యుద్ధం చేయడం లేదు.

ప్రత్యేక విభాగం ఉన్నా...: ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా మలేరియా విభాగం ఉంది. కీటకజనిత వ్యాధుల నివారణ కోసం సిబ్బంది పని చేయాలి. మలేరియా, డెంగీ జ్వరాలు సోకకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ఉండేందుకు పరిసరాలను ఎలా ఉంచుకోవాలో అవగాహన కార్యక్రమాల ద్వారా చెప్పాలి. ఇళ్లలో ఖాళీ టైర్లు, సీసాలు, కొబ్బరి బోండాలు, నీటి కుంటలు ఉండకుండా చూసుకోవాలని, డ్రైడే పాటించాలని ఊరూరా తిరిగి చాటింపు చేయాలి. కానీ అయిదు జిల్లాల్లో ఎక్కడా మలేరియా విభాగం మెరుగైన పని తీరు కనబర్చడం (మిగతా 2లో)



అంతా సిద్ధం!

- స్వాతంత్ర్య వేడుకలకు సింగరేణి మైదానం ముస్తాబు
- హెలికాప్టర్‌లో రానున్న స్పీకర్ మధుసూదనాచారి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూపాలపల్లిలోని సింగరేణి మైదానంలో మంగళవారం జరిగే స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎండ తగలకుండా భారీ షామియానాలను వేశారు. బారికేడ్లు కట్టారు. ముఖ్యఅతిథిగా శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి హాజరవుతున్నారు. ముందుగా శాసన సభలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం హెలికాప్టర్‌లో జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు జెండాను ఎగరేసి పోలీసుల గౌరవ వందనం మిగతా 2లో...



రాగన్నగూడెంలో యంత్రాలతో ప్రయోజనాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

యంత్ర సాగు.. బహు బాగు..!

● గ్రామీణ ప్రాంతాల్లో యాంత్రీకరణ వైపు అన్నదాతల ఆసక్తి

రాయపర్తి, న్యూస్‌టుడే: సంప్రదాయ వ్యవసాయం శ్రమతో కూడుకున్న పని... దీంతో పాటు ఎక్కువ మంది మనుషులు అవసరం... తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో యంత్రాలతో ఎక్కువ పని చేసుకునే అవకాశం ఉండటంతో రైతులు యాంత్రీకరణ వైపు ఆసక్తి చూపిస్తున్నారు.. యంత్రాల ద్వారా ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు రైతులకు వివరిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం చేసేందుకు తీవ్రమైన కూలీల కొరత నెలకొంది. . నాట్లు వేయడం దగ్గర నుంచి పంట చేతికొచ్చే దాకా కూలీల కొరతతో రైతులు తీవ్ర అవస్థల పాలవుతున్నారు.. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు యంత్రాలతో సాగు చేయడమే మంచిదని రైతులు నమ్ముతున్నారు.. యంత్రాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. వరంగల్ రూరల్ జిల్లాలోని పలు గ్రామాల రైతులు ఆ దిశగా అడుగులు వేసి ప్రయోజనాన్ని పొందుతున్నారు. దుక్కులు దున్నినప్పటి నుంచి పంట కోసే దాకా వివిధ రకాల యంత్రాలను వినియోగించి అన్నదాతలు వ్యవసాయాన్ని సులభతరం చేసుకుంటున్నారు. గతంలో పలుమార్లు ప్రభుత్వం అందించిన రాయితీ యంత్రాలను కొనుగోలు చేసి ప్రయోజనాన్ని అందుకున్నారు. రాయితీ పరికరాలు అందని అనేక మంది రైతులు సైతం యంత్రాలను కొనుగోలు చేశారు. అధిక మొత్తంలో నగదు వెచ్చించలేని వారు సైతం పాత యంత్రాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మరింత ఎక్కువ మొత్తంలో యంత్ర పరికరాలందిస్తే అనేక మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశముంది. యంత్రాలతో సాగు చేస్తున్న రైతులను 'న్యూస్‌టుడే' పలకరించగా వారి అభిప్రాయాలిలా ఉన్నాయి.

యంత్రాలతో ఎనలేని ప్రయోజనం

–రావిపాటి ప్రశాంత్, రైతు, పెర్కవేడు



యంత్రాలతో సాగు చేయడంతో ఎనలేని ప్రయోజనం ఉంది. మాకున్న పద్నాలుగెకరాల భూమిలో వ్యవసాయం చేయడం కూలీల కొరతతో ఇబ్బందిగా మారింది. గతంలో రాయితీపై విత్తనాల గొర్రు, మొక్కజొన్న తొలిచే యంత్రం, రోటోవేటర్, ఇటీవల విత్తనాలు వేసే యంత్రాన్ని కొనుగోలు చేశాను. మా వ్యవసాయ భూమిలో విత్తనాలు వేసిన అనంతరం పలువురు రైతుల పొలాల్లో విత్తనాలు వేయడం వల్ల అదనంగా ఆదాయం పొందే అవకాశం ఏర్పడింది. విత్తనాలు వేసే యంత్రం రూ.50 వేలు కాగా రూ.15 వేల రాయితీ వచ్చింది. రాయితీపై పలు రకాల యంత్ర పరికరాలు అందిస్తుండటంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

వ్యవసాయం...సులభతరం

–మాకినేని చిన్నకృష్ణారావు, రైతు, పెర్కవేడు



ఇటీవల రాయితీపై షాప్‌కట్టర్(చొప్ప ముక్కలు చేసే యంత్రం) కొనుగోలు చేశాను. రూ.24 వేలు కాగా రూ.10 వేలు రాయితీ ఇచ్చారు. పశువులకు మేత వేయడంతో కొంత మాత్రమే తినడం వల్ల కొంత వృథా అయ్యేది. షాప్‌కట్టర్ ద్వారా ముక్కలుగా చేసి వేయడంతో వృథా కావడం లేదు. చొప్పను ముక్కలుగా కోసి వేసేందుకు గతంలో అధిక సమయం పట్టేది. గతంలో రాయితీపై రోటోవేటర్ కొనుగోలు చేశాను. యంత్రాలు వినియోగించడం వల్ల వ్యవసాయాన్ని కొంత వరకు సులభతరం చేసుకునే అవకాశం ఏర్పడింది.

రాయితీపై మరిన్ని అందించాలి

–వడగం మల్లయ్య, రైతు, పెర్కవేడు



నాకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసేందుకు దున్నడానికి కూలీలను పెట్టడం ఇతర ఖర్చులు భారీగా అయ్యేవి. ప్రస్తుతం ఒక పాత ట్రాక్టర్‌ను రూ.5.20 లక్షలకు కొనుగోలు చేశాను. వ్యవసాయంలో ఖర్చులు తక్కువగా కావడంతో పాటు సమయం ఆదా అవుతోంది. యంత్రాలతో సాగు చేయడం ప్రయోజనకరంగా మారింది. నా వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం ఇతర రైతుల పొలాల్లో పనులు చేయడంతో అదనపు ఆదాయం వస్తోంది. యంత్రాలతో సాగు చేయడం ఎంతో ప్రయోజనకరం. ప్రభుత్వం రాయితీపై పవర్ టిల్లర్, పవర్‌వీడర్ లాంటివి అందస్తే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు

–దీకుంట్ల సాయిలు, రైతు, రాయపర్తి



యంత్రాలను వినియోగించడం వల్ల వ్యవసాయ పనులు సులభంగా అవుతున్నాయి. గతంలో కూలీల కొరత తీవ్రంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. రెండేళ్ల క్రితం రూ.50 వేలు వెచ్చించి పాత పవర్ టిల్లర్ కొనుగోలు చేశాను. కొత్తది కొనుగోలు చేసేందుకు దరఖాస్తు చేసుకుంటాను. రైతులు పలుచోట్ల ఆధునిక సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రాయితీ యంత్రాలు ఎక్కువ మొత్తంలో అందించేలా చూడాలి. ఆధునిక యంత్రాలతో సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తున్నాయి.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి



పూజల్లో పాల్గొన్న స్పీకర్ మధుసూదనాచారి, తెలంగాణ పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం తదితరులు

ఓబుల్‌కేశ్వాపూర్ (జనగామ రూరల్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతతె ప్రశాంతత సాధ్యమని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌లో తెలంగాణ పర్యాటక శాఖ, కల్చరల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, టీటీడీ, గ్రామస్థుల సహకారంతో నిర్మించిన పద్మావతి గోదాదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మం ఎంతో గొప్పదన్నారు. నేటి సమాజంలో విద్యా, విజ్ఞానం పెరుగుతుందే తప్ప, విలువలు మాత్రం రోజురోజుకు క్షీణిస్తుందన్నారు. నూతన ఆలయ నిర్మాణంతో ప్రజల్లో భక్తి భావం పెరిగి ప్రశాంతత, విలువలు పెరుగుతాయన్నారు. ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం తన స్వగ్రామంలో ఇంత గొప్ప ఆలయం నిర్మాణం చేపట్టడం, అందుకు టీటీడీ, గ్రామ ప్రజల సహకరించడం సంతోషదాయకమన్నారు. బుర్రా వెంకటేశం మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే ప్రజలు సమాజంలో అందరూ బాగుండాలని కోరుకోవాలే తప్పా, వింత కోరికలు కోరుకోవద్దన్నారు. జనగామ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. యాదాద్రిని దర్శించుకుని రాజపేట, కొలనుపాక మీదుగా ఓబుల్‌కేశ్వాపూర్ ఆలయాన్ని సందర్శించి పెంబర్తిలోని హస్త కళల కేంద్రాన్ని సందర్శించేలా కార్యాచరణ, అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందన్నారు. సర్పంచి ధర్మ జయప్రకాశ్ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బడికె ఇందిర, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బుర్రా ఆంజనేయులు, సభ్యులు, బాలచారి, రఘు పాల్గొన్నారు.

చేద్దామా! యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

లేదు. దోమ కాటుకు గురైన ప్రజలు జ్వరాలతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇలాంటి వారితో సర్కారు, ప్రైవేటు దవాఖానాలు కిటకిటలాడుతున్నాయి.

సమస్యాత్మక గ్రామాలు 360 : జయశంకర్ జిల్లాలోని ములుగు, తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం, వాజేడు, మహదేవ్‌పూర్, మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు ఏజెన్సీ మండలాల్లో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 360 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. జూన్ నుంచి అక్టోబరు వరకు ఇంటింటికీ దోమల నివారణకు రెండు సార్లు పిచికారీ చేయాలి. ఇప్పటి వరకు దానిపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడం లేదు. కొన్ని చోట్ల యంత్రాలే పని చేయడం లేదు. ప్రైవేటుగా పంపులు తెప్పించి అప్పుడప్పుడు మందులు చల్లుతున్నారు.

మహా నగరంలో మరీ అధ్వానం: వరంగల్ మహా నగరంలో 200కుపైగా మురికి వాడలు ఉన్నాయి. వీటితోపాటు దోమల ఆవాసాలైన మురికి, నీటి గుంటలు, నాలాల పరిసరాలపై అర్బన్ మలేరియా విభాగం వారు శ్రద్ధవహించడం లేదు. తగిన సిబ్బంది ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాదాపు 150 మందిని కాంట్రాక్టు పద్ధతిన నియమించుకున్నారు. జనరల్ ఫండ్ నుంచి ఏడాదికి రూ. 60 లక్షల నుంచి రూ. 70 లక్షలు వెచ్చిస్తున్నా ఫలితం కనిపించట్లేదు. ఫాగింగ్ చేయకుండానే డీజిల్ బిల్లులు ఎత్తుకున్న వైనంపై గతంలో ఒక అధికారిపై వేటు పడింది. ఇంత జరిగినా ఎక్కడి దోమలు అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది.

పారిశుద్ధ్య నిధులు స్వాహా!

● ప్రతి గ్రామ పంచాయతీకి పారిశుద్ధ్యం కోసం ప్రత్యేకంగా ఏడాదికి రూ. 10,000 వరకు అందుతాయి. ఈ నిధులను చాలా గ్రామాల్లో సర్పంచి, అధికారులు కలిసి స్వాహా చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ● పురపాలికలు, నగర పంచాయతీల్లోనూ ఎక్కడా దోమల నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు. జనగామలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్కసారీ ఫాగింగ్ చేయలేదు. ఇటీవలే దోమల నివారణకు మందులు, యంత్రాలు కొనుగోలు చేయడానికి రూ. 2 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేసి చేతులు దులిపేసుకున్నారు. ● పరకాలలో ఇటీవల వర్షాలకు దోమల బెడద ఎక్కువైంది. మందులు చల్లడం గానీ, ఫాగింగ్ గానీ మరిచారు.

లెక్కలోకి కొన్నే..: మలేరియా, డెంగీ కేసులు పెద్ద సంఖ్యలో ఉన్నా, లెక్కలోకి వచ్చేవి మాత్రం కొన్నే ఉంటున్నాయి. ప్రజలు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుండడంతో బాధితుల సంఖ్య సరిగ్గా తెలియడం లేదు. వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా మలేరియా విభాగంలో సిబ్బంది లేక ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నారు. వీరి నియామకం చేపడితే కొంత ఫలితం ఉండే అవకాశం ఉంది.

శెభాష్ గంగదేవిపల్లి: ఆదర్శగ్రామం గంగదేవిపల్లిలో దోమల నివారణపై గ్రామస్థులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆరోగ్య శాఖ నుంచి వచ్చే నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తున్నారు. వర్షాకాలంలో కనీసం మూడు సార్లు పిచికారీ నిర్వహిస్తూ దోమల వ్యాప్తిని అడ్డుకుంటున్నారు.

నిర్మూలన ఎప్పటికయ్యేను?: ప్రపంచ మలేరియా నివేదిక 2016 ప్రకారం ఆగ్నేయాసియా దేశాల్లో నమోదైన మలేరియా కేసుల్లో 89 శాతం భారత్ నుంచే. 2015లో మాల్దీవులను మలేరియా రహిత దేశంగా ప్రకటించారు. గతేడాది శ్రీలంక 100 శాతం నిర్మూలించగలిగింది. కేంద్ర ప్రభుత్వం అయిదేళ్ల వ్యూహంతో ఒక విధానాన్ని ప్రకటించింది. మలేరియా నిర్మూలన కావాలంటే రూ. 10,653 కోట్ల వరకు వెచ్చించాలి. 2030 వరకు పూర్తిగా నిర్మూలన జరుగుతుందని అంచనా!

అంతా సిద్ధం!

(మొదటిపేజీ తరువాయి): స్వీకరిస్తారు. తర్వాత స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి, ఉత్తమ సేవలందించిన అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులకు అవార్డులు అందజేస్తారు. అనంతరం ప్రసంగిస్తారు.

బ్యానర్ల ఏర్పాటు.. మైకులో ప్రచారం: వేడుకలకు ప్రజలంతా స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతూ భూపాలపల్లిలోని ఐదు ప్రధాన కూడళ్లలో , ఏటూరునాగారం, కాటారం, ములుగులో జిల్లా అధికార యంత్రాంగం రూపొందించిన ప్రచార బ్యానర్లను కట్టారు. ప్రచార, పౌర సంబంధాల శాఖ తరఫున పలువురు కళాకారులు మైకులో ప్రచారం చేశారు.

పోలీసుల ముందస్తు కవాతు : పోలీసులు ముందస్తు కవాతు నిర్వహించారు. భూపాలపల్లి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ చేయగా ఎస్పీ ఆర్.భాస్కరన్ పరిశీలించారు. ఏర్పాట్లను భూపాలపల్లి ఆర్డీవో వీరబ్రహ్మచారి పరిశీలించారు. వర్షం పడటం వల్ల మైదానంలో మొరం పోయించారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సున్నం పోసి మార్కింగ్ ఇచ్చారు.

ఇక తేలికేం కాదు

డిగ్రీలో డిటెన్షన్ అమలుకు కసరత్తు



న్యూస్‌టుడే, విద్యారణ్యపురి

డిగ్రీ విద్యను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి మరో అడుగు ముందుకు వేసింది. డిగ్రీలో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే ఆలోచనల్లో ఉంది. రాష్ట్రంలో పలు సంప్రదాయ విశ్వవిద్యాలయాల్లో ఈ విధానానికి కసరత్తు జరుగుతోంది. డిగ్రీ ప్రవేశాల్లో ఆన్‌లైన్, సెమిస్టర్ విధానాలు ఇప్పటే అమలవుతున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు క్రెడిట్ల విధానాన్ని తీసుకురానుంది. ఉన్నత విద్యామండలి ఈ విధానాన్ని వృత్తివిద్యా కోర్సుల్లో అమలు చేస్తోంది. ఇది అమల్లోకి వస్తే ఇక డిగ్రీ విద్యను అల్లాటప్పాగా తీసుకుంటే మొదటికే మోసం వస్తుంది.

ఇప్పటి వరకు డిగ్రీలో ఎలాంటి డిటెన్షన్ లేదు. ఫలితంగా విద్యార్థులు ఎన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అయినా ఆఖరు సంవత్సరం వరకు వెళ్లేవారు. క్రెడిట్ల విధానం అమల్లోకి వస్తే ప్రథమ సంవత్సరం నుంచే 50 శాతం సబ్జెక్టులలో ఉత్తీర్ణులు కావాల్సిందే. డిగ్రీలో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీసీఎస్) ను అమలు చేయాలని యూజీసీ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో సెమిస్టర్ విధానం అమలువుతోంది. మూడేళ్ల డిగ్రీ కోర్సులో 144 నుంచి 180 క్రెడిట్‌లను కేటాయించారు. బీఏ ప్రథమ సెమిస్టర్‌కు 24, బీఎస్సీలో 27, బీకాంలో 30 క్రెడిట్లు ఉంటాయి. మొదటి సంవత్సరంలో రెండు సెమిస్టర్లలోని క్రెడిట్లలో సగం కంటే తక్కువ వస్తే రెండో ఏడులోకి ప్రవేశం ఉండదు. సెమిస్టర్ ఉండటంతో సప్లిమెంటరీ పరీక్షలు కూడా ఉండవు. అంటే 50 శాతం క్రెడిట్లకు తక్కువ వస్తే ఒక విద్యా సంవత్సరం వృథా అవుతుంది. ఈ విధానం నుంచి భయటపడాలంటే మొదటి నుంచి విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికలతో చదవాలంటున్నారు విద్యావేత్తలు.

ఆరంభం నుంచే అధ్యయనం కీలకం

సెమిస్టర్ విధానంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు జరుగుతాయి. రెండు సెమిస్టర్లలో 50 శాతం క్రెడిట్లను సాధించిన విద్యార్థులు మాత్రమే రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతారు. డిటెన్షన్ నుంచి భయట పడాలంటే విద్యా సంవత్సరం నుంచి అధ్యయనం చేయడం కీలకం. అలా చేస్తేనే క్రెడిట్లు సాధించడం సులభం అవుతుంది. సిలబస్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ఎదో ముఖ్యమైన ప్రశ్నలను ఎంపిక చేసుకొని.. చదవడం వల్ల ప్రయోజనం ఉండదు. సిలబస్‌లోని అన్ని పాఠ్యాంశాలను చదవాలి. అవగాహన కలిగి ఉండాలి. గైడ్‌ల జోలికి వెళ్లకపోవడం మరీ మంచిది. పాఠ్యపుస్తకాలను ఎంపిక చేసుకోవాలి.

కేయూ పరిధిలో..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 292 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో 1,25,137 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈసారి ప్రథమ సంవత్సరంలో 45,305 మంది విద్యార్థులు చేరారు. ఇంకా 79,832 సీట్లు భర్తీకాలేదు.

హాజరు తప్పనిసరి

ఇప్పటి వరకు డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండేది. కానీ డిటెన్షన్ విధానం అమల్లోకి వస్తే హాజరు తప్పనిసరి. తరగతులకు హాజరైతేనే పాఠ్యాంశాలపై పట్టు వస్తుంది. సిలబస్‌పైనా అవగాహన పెరుగుతుంది. రోజు వారీగా పాఠ్యాంశాలను సమీక్ష చేసుకోవడానికి వీలవుతుంది. అధ్యాపకులతో ఎక్కువ సమయం గడిపే వీలుంటుంది. డిగ్రీని తేలికగా తీసుకోవడం వల్ల ఎలాంటి నష్టం జరుగుతుందో తెలుస్తుంది. విద్యార్థుల హాజరు శాతం పెంచడం కోసం ప్రభుత్వం డిగ్రీ కాలేజీల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తోంది. అయినా సత్ఫలితాలు రావడం లేదు. డిగ్రీలో గత ఐదేళ్ల నుంచి కేవలం 35 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులు అవుతున్నారు. డిటెన్షన్ విధానం అమల్లోకి వస్తే ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశాలు ఉంటాయి. విద్యార్థులు కూడా డిగ్రీలో ప్రవేశాలు పొందిన మొదటి రోజు నుంచే పరీక్షలకు సిద్ధం కావడంలపైన దృష్టి పెడతారు. ఆ దిశగా చదువుతారని అధ్యాపక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రుద్రదేవుడికి అన్నపూజ



రుద్రదేవుడికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు

హన్మకొండచౌరస్తా, న్యూస్‌టుడే: శ్రావణమాసోత్సవాలలో భాగంగా హన్మకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, జలాభిషేకం చేశారు. అనంతరం రుద్రాభిషేకం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 300 మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 48 కిలోల పెరుగన్నంతో అన్నపూజ చేశారు. రుద్రదేవుడిని శివతత్వంలోని కృష్ణావతారంగా అలంకరించారు. కృష్ణాష్టమి సందర్భంగా మల్లెలు, జాజులు, గులాబీలు, కనకాంబరం, చామంతి పూలతో అలంకరించారు. తర్వాత రుద్రదేవుడి దివ్య దర్శనాన్ని భక్తులకు చూపించారు.



దర్శనం చేసుకుంటున్న భక్తులు

నీటి కేటాయింపుల్లో వివక్ష

భాజపా తెలంగాణ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి



పవర్ పాయింట్ ద్వారా వివరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

సుబేదారి, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లాకు నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందని భాజపా సీనియర్ నాయకులు, తెలంగాణ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నరహరి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం భాజపా అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు జరుగుతున్న అన్యాయం గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకం ద్వారా గోదవరి నది జలాలను మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్‌కు తీసుకొని వెళ్లి వరంగల్‌కు రాకుండా చేస్తున్నారన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న సమయంలో నిధులు కేటాయిస్తే తెదేపా ప్రభుత్వం కాకతీయ కాలువలను తవ్విందన్నారు. తెదేపా హయాంలో దేవదుల ప్రాజెక్టును ప్రారంభించారని, కాంగ్రెస్ పార్టీ హయాంలో కంతనపల్లి ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. వీటి ద్వారా నీటిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇవ్వకుండా కాళేశ్వరం నుంచి నీటిని పోచంపాడుకు తీసుకొని వెళ్లి అక్కడ నుంచి తిరిగి వరంగల్ ఇస్తామనడం హాస్యాస్పదమన్నారు. కాళేశ్వరం నుంచి హుజురాబాద్ మీదిగా కిట్స్ వద్ద కాకతీయ కెనాల్‌కు విడుదల చేయవచ్చని చెప్పారు. కాంతపల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీటిని అందించే అవకాశం ఉందన్నారు. దేవాదులను మూడో దశను పూర్తి చేసి పంపింగ్ ద్వారా నీటిని ఇవ్వవచ్చన్నారు. కానీ ఇవేమి కాకుండా ఎక్కడి నుంచో నీటిని ఇస్తామనడం తప్పుడు ప్రచారం చేయడమే అన్నారు. వరంగల్‌కు అన్యాయం జరుగుతుంటే స్థానిక మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు మాట్లాడడం లేదన్నారు. కాకతీయ కాలువలకు మరమ్మతులు చేసి నీటిని విడుదల చేస్తే రైతులకు సాగు, ప్రజలకు తాగు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీటి పంపకాలలో జరుగుతున్న అన్యాయంపై భాజపా ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలకు సిద్ధమవుతున్నామన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి.. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగుల రాకేశ్‌రెడ్డి, కొలను సంతోష్‌రెడ్డి, జగదీశ్వర్, శివ కుమార్, జి. శ్రీనివాస్, మారెపల్లి రాంచెంద్రరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పీజీలో సీట్ల కేటాయింపు

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని శాతవాహన, వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎకాం, ఎంఎస్సీ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరానికి గాను పీజీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం మొదటి విడతలో వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారికి సోమవారం సీట్లను కేటాయించారు. పీజీసెట్-17లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈనెల 9 వరకు జరిగింది. ఈనెల 10న వెబ్‌ఆప్షన్ల గడువు ముగిసింది. రెండు విశ్వవిద్యాలయాల్లోని కోర్సుల్లో 10వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 34 వేల మంది విద్యార్థులు పోటీపడ్డారు. ప్రవేశ పరీక్షలు లేని పీజీ కోర్సుల్లో ఈనెల 12న డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించారు.

22లోగా కళాశాలల్లో చేరండి: సీట్లు లభించిన విద్యార్థులు ఈనెల 22 లోగా ఆయా కాలేజీల్లో ప్రవేశాలు పొందాలని కేయూ పీజీ ప్రవేశాల సంచాకులు ఆచార్య వడ్డే రవీందర్, సంయుక్త సంచాలకులు డాక్టర్ వై.వెంకయ్య, డాక్టర్ టి.రాజకొమురయ్య తెలిపారు. కేయూ వెబ్‌సైట్‌లో సీట్లు పొందిన విద్యార్థుల వివరాలు, వారికి కేటాయించిన కళాశాలల వివరాలు ఉంచినట్లు పేర్కొన్నారు. 22వ తేదీ తర్వాత సీట్లు మిగిలితే రెండో విడత ప్రవేశాల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు.



పంద్రాగస్టు వేడుకల సందర్భంగా వరంగ్ అర్బన్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను సోమవారం రాత్రి ముస్తాబు చేశారు. హన్మకొండ నక్కలగుట్టలోని గ్రామీణ జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు, డీసీసీబీ బ్యాంకు భవనం, అర్బన్ కలెక్టర్ కార్యాలయం, కలెక్టర్ నివాసాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

న్యూస్‌టుడే, బాలసముద్రం

తెరపై ఈనాడు

ఏటూరునాగారం: శ్రీవెంకటేశ్వరటాకీస్: **జయ జానకి నాయక**

పస్రా: శ్రీమెహర్‌రంగ మహల్: **జయ జానకి నాయక**

ములుగు: తిరుమల కళామందిర్: **జయ జానకి నాయక**

ములుగు

నియామకం

ములుగు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అనుబంధ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడిగా మండలంలోని కొడిశలకుంట గ్రామానికి చెందిన బానోత్ సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండలాధ్యక్షుడు వేములపెల్లి భిక్షపతి సురేష్‌ను నియమించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విమోచన దినాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న రవీందర్

ములుగు, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అధికారికంగా ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. భారత దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికి తెలంగాణకు మాత్రం ఇంకా రాలేదని ఆరోపించారు. నైజాం నవాబు తొత్తులు చేసే దుర్మార్గాలు తట్టుకోలేక తెలంగాణ రైతాంగ పోరాటం జరిగి 4500 మంది ప్రాణాలు అర్పించారన్నారు. అనంతరం ఆ పోరాటానికి తలొగ్గిన నైజాం కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయిన తర్వాత సెప్టెంబరు 17 తెలంగాణకు విముక్తి జరిగిందని తెలిపారు. అంతటి పోరాట ఫలితంగా సాధించిన విముక్తి దినమును అధికారికంగా ప్రకటించకుండా ద్రోహం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వెంటనే అధికారికంగా ప్రకటించాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఇంజం కొమురయ్య, జక్కుల అయిలయ్య, వెల్పుకొండ శరబంధం, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల గౌరవ వేతనం పెంచాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసే కార్మికులకు గౌరవ వేతనం పెంచాలని వంట కార్మికుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేసే కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పోడుపు సంఘాల మహిళలు కార్మికులుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారని తెలిపారు. చాలీచాలని కమీషన్లతో రోజులో కనీసం ఆరు గంటల పాటైనా పనిచేస్తూ తమ విలువైన శ్రమను వెచ్చిస్తున్నారన్నారు. కార్మికులకు సరిపడ వేతనంతో పాటు వంట షెడ్లు నిర్మించాలని, వంట చేసేందుకు వంట గ్యాస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరెడ్డి ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.చిన్నలక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మి, ఉపాధ్యక్షురాళ్లు రజిత, పద్మావతి, మండలాల అధ్యక్షులు పర్వీన్, సరోజిని, కార్మికులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

మదనపల్లి(ములుగు రూరల్),న్యూస్‌టుడే: కార్యకర్తలు గ్రామాల్లో సైనికుల్లా పనిచేయాలని తెదేపా మండలాధ్యక్షుడు పల్లె జయపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మదనపల్లి, పందికుంట గ్రామాల్లో ఆయన బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. మదనపల్లి బూత్ కమిటీ కన్వీనర్లుగా కందకట్ల యాదగిరి, కూనూరి రాజన్నను ఎన్నుకున్నారు. పందికుంట బూత్ కమిటీ కన్వీనర్‌గా ధారవత్ భాస్కర్, సింగరబోయిన సంతోష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల వరకు గ్రామాల్లో తెదేపాను బలోపేతం చేయాలన్నారు. పార్టీ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ నాయకత్వం అండదండలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట బొమ్మకంటి రమేష్, పసుల సాంబయ్య, పోరిక బెనర్జీ, కొర్ర సమ్మయ్య, సంపత్, పూర్ణచందర్‌లు ఉన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




ఆదర్శ హైస్కూల్‌లో ఉట్టి కొడుతున్న దృశ్యం

కమలాపురం(మంగపేట),న్యూస్‌టుడే: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమలాపురం ఆదర్శ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టికొట్టారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమ పోటీలు, శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కమలాపురంలో..

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఏటూరునాగారంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్టార్ యువజన సంఘం అధ్యక్షుడు పర్వతాల రమేష్ ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరీ మాత ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు స్థానిక ఎస్సై కిరణ్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ మెహరున్నీసా, యువజన సంఘం నాయకులు ముక్కెర భిక్షపతి, కిరణ్, రవి, రమేష్, సుమన్, కిరణ్‌కుమార్, అన్వేష్ తదితరులు పాల్గొని సంబరాలు నిర్వహించుకున్నారు. రామాలయం సెంటర్‌లో రామాలయ కమిటీ అధ్యక్షుడు పోగుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కందకట్ల భరత్ అనే యువకుడు ప్రథమ, తృతీయ బహుమతులు గెలుపొందగా, ద్వితీయ బహుమతిగా సునారికాని ఎల్లేష్ సాధించారు. యాదవనగర్‌లో యాదవ సంఘం నాయకులు కొండ ఉదయ్, నాగరాజు, మహేష్, దేవేందర్, రాజు, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొని ఉట్టికొట్టే సంబరాలు నిర్వహించుకున్నారు.



ములుగులో ఉట్టి కొడుతున్న ఎస్సై వెంకటేష్



మంగపేటలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రసాద్

వెంకటాపూర్,న్యూస్‌టుడే: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వెంకటాపూర్‌లోని శ్రీరామాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నరెడ్ల భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక మాధురి, వేదవ్యాస ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలను ధరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రఘునాథాచార్యులు, ఛైర్మన్ భాస్కర్, వర్తక సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, పల్నాటి రమేష్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

చెరుపల్లి(మంగపేట),న్యూస్‌టుడే: మండలంలోని చెరుపల్లి కోదండరామాలయంలో సోమవారం గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మనగుడి కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని గో పూజ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పూజ కార్యక్రమాలను పూజారి కంచిభట్ల మణికంఠశర్మ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తితిదే వరంగల్ ఇన్‌చార్జి రాంరెడ్డి కృష్ణమూర్తి, శ్రీపల్లి సిద్ధార్థ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మండల కమిటీ సభ్యుడు ముత్తినేని పాపారావు, పద్మ, ముకుందం, శ్రీనివాస్, రాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

పస్రా(గోవిందరావుపేట),న్యూస్‌టుడే: మండలంలోని పస్రా గ్రామంలో సోమవారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నూకల నగేష్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సర్పంచి జిమ్మ వరలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు మద్దినేని రామనర్సమ్మ, ఎస్సై మహేందర్‌కుమార్ ప్రారంభించారు. కృష్ణుడి వేషధారణలో ఓ చిన్నారి పలువురిని ఆకట్టుకొన్నాడు. మద్దినేని శ్రీనివాస్, ధనుంజయ, తేజరాజు, యాకయ్య, అయిలయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ములుగు, న్యూస్‌టుడే: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జాతీయ రహదారి పక్కన గణేష్ చౌక్ వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ ఓదెల వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి ఉట్టి కొట్టారు. యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. విజేతలకు దాతల ఆర్థిక సహాయంతో నగదు, బహుమతులు అందజేశారు. సర్పంచి సాగర్, అశోక్, మల్లయ్య, జయపాల్‌రెడ్డి, అహ్మద్‌పాషా పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

ములుగు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పాదయాత్ర ద్వారా ఎండగడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.వినయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 20 నుంచి మండలంలో 'ఇంటింటికి కాంగ్రెస్- మన గ్రామానికి మన వీరన్న' పేరుతో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ అమలు చేయడంలో, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇళ్లులేని ప్రతి పేదవాడికి రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని డిమాండు చేస్తూ ఇంటింటికి పాదయాత్ర కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భిక్షపతి, యూనస్, కిషోర్, శివాజీ, మామిడిశెట్టి నారాయణ, లియాకత్ అలి, చాంద్‌పాషా, కంబాల రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ములుగు,న్యూస్‌టుడే: ములుగును జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేస్తూ సోమవారం స్థానిక జాతీయ రహదారిపై జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అర్హత లేని ప్రాంతాలను జిల్లాలుగా ప్రకటించారన్నారు. అన్ని అర్హతలు ఉన్న ములుగును మాత్రం జిల్లా చేయకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన మాటను తప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మేడారం జాతర నాటికి వన దేవతల సాక్షిగా జిల్లాగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నూనె శ్రీనివాస్, మునీంఖాన్, గణేష్, కుమార్, రవి, మల్లయ్య, సమ్మయ్య, సంజీవ, దాసు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

'పేదల భూములు లాక్కుంటున్న ప్రభుత్వం'

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: హరితహారం పేరుతో తెరాస ప్రభుత్వం పేదల భూములు లాక్కుంటోందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సీతక్క ధ్వజమెత్తారు. మండలంలోని శంకరరాజుపల్లి, రొయ్యూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో మూడు దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములను స్వాధీనం చేసుకుంటూ హరితహారం పేరిట మొక్కలు నాటుతున్నారన్నారు. ఫలితంగా పోడు భూమినే నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న పేదలు వీధిన పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని గొత్తికోయ గూడేల్లోని ప్రజలు వాగుల్లో, తోగుల్లో నీళ్లు తాగి విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటినందించాలని కోరారు. గంటల కుంట, కొమురంభీం గూడెం ప్రజలు చెల్మకు చీరలు కట్టి వర్షపునీటిని కూడా తాగుతున్నారన్నారు. ఐటీడీఏకి కూతవేటు దూరంలోనే ఉన్న గ్రామానికి కూడా బోరింగ్, రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. కనీసం ఆయా గ్రామాలకు 108 అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఐటీడీఏ అధికారులు, అటవీ శాఖ, ప్రభుత్వం స్పందించి గొత్తికోయలకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఖలీల్‌ఖాన్, గుర్రం దేవేందర్, దొడ్డ కృష్ణ, పెద్దబోయిన నర్సింగరావు, బండి సత్యనారాయణ, గౌస్, సంగోజు సమ్మయ్య, బి.రమేష్, కంకనాల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. శంకరరాజుపల్లికి చెందిన తాటిపెల్లి రాజయ్య, జనగాం లక్ష్మయ్య, కుమ్మరి ఎల్లయ్య, గొర్ల రామయ్య, జాడి సత్యనారాయణ, మంతెన గట్టయ్య, అంతటి నర్సింహులు, గూడూరు రాజయ్య తదితరులు తెదేపాలో చేరారు.

ములుగు

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

గొర్లవీడు (భూపాలపల్లి), న్యూస్‌టుడే: గొర్లవీడు గ్రామంలో కుక్కల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా గ్రామంలో కుక్కలు పది మందిని గాయపర్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

దరఖాస్తులకు గడువు పెంచాలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలో నిరుద్యోగ ఎస్సీ లబ్ధిదారులకు రుణాల మంజూరు కోసం దరఖాస్తుల స్వీకరణకు మరో వారం రోజుల పాటు గడువు పెంచాలని తెరాస మండల సీనియర్ నాయకుడు జోగుల సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

బిల్టు కంపెనీపై ఐకాస నాయకుల చర్చ

కమలాపురం,(మంగపేట),న్యూస్‌టుడే: మంగపేట మండలం కమలాపురం బిల్టు కర్మాగారం భవిష్యత్తుపై బిల్టు సీఈవో నిహార్ అగర్వాల్‌తో చర్చించినట్లు బిల్టు కర్మాగార ఐకాస నాయకులు తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలోని గురుగ్రావ్ బిల్టు ప్రధాన కార్పొరేట్ కార్యాలయంలో సీఈవో నిహార్ అగర్వాల్‌తో సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు చొక్కారావు, రాంచందర్, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, గణపతి, ఖుర్బాన్‌అలీ మాట్లాడారు. యాజమాన్యం జీతాలు ఇవ్వక 26 నెలలు కావస్తుందని ఫలితంగా కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నామని సీఈవో దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. స్పందించిన సీఈవో మాట్లాడుతూ కర్మాగారం పునరుద్ధరణ నిర్ణయంలో ఆలస్యమైందని మూడు నెలల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు కంపెనీ మనుగడపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్మికుల కుటుంబాల పోషణకోసం ఆగస్టు నెలలో రూ.10 వేలు చెల్లిస్తామని ప్రకటించారన్నారు. ప్రతి నెల కార్మికుల కుటుంబాలు గడవటం కోసం కొంత డబ్బులు చెల్లించి మూడు నెలల్లో కంపెనీ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకొని న్యాయం చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు.

మూతపడిన వసతిగృహాలు

మంగపేట,న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం మండలంలో నెలకొల్పిన వసతిగృహాలు కనీస వసతులు, అధికారులు లేక పోవడం వల్ల విద్యార్థులు ఆసక్తి చూపక ప్రస్తుతం అవి మూతపడి ఉన్నాయి. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గంపోనిగూడెం ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా గంపోనిగూడెం సమీపంలో ఎస్సీ, బీసీ విద్యార్థుల కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వసతిగృహాలు విద్యార్థులు లేక నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా పేద పిల్లలు పాఠశాల విద్యకు దూరమవుతున్నారు. పాఠశాలకు వసతిగృహాలు సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల విద్యార్థులు ఆసక్తి చూపటం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల, పేద పిల్లలకోసం బీసీ, ఎస్సీ గురుకులాలు ఏర్పాటు చేసినట్లైయితే పేద విద్యార్థులకు వరంగా మారుతుందని మండల ప్రజలు కోరుతున్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి ముస్తాబు

ములుగు రూరల్, న్యూస్‌టుడే: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 21 గ్రామపంచాయతీలలో గల ప్రభుత్వ పాఠశాలలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. జెండా పండుగ నిమిత్తం చేపట్టాల్సిన కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, యువజన సంఘాల నాయకులు హడావుడిగా కనిపించారు.

జాతీయ జెండా ఎగురవేయాలి

ములుగు, న్యూస్‌టుడే: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తెరాస ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గట్టు మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గ్రామ సమన్వయకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ములుగు, న్యూస్‌టుడే: సర్వాయి పాపన్న జయంతిని ఈనెల 18న అధికారికంగా నిర్వహించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కారుపోతుల యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాయిపాపన్న స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 2 నుంచి 18 వరకు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ములుగు డివిజన్‌లో రెండు రోజుల పాటు జీపు జాతను నిర్వహించనున్నట్లు తెలిపారు. గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బుర్ర జనార్ధన్, గుండెబోయిన రవి, ముప్పిడి పెల్లి కుమార్, చంద్రగిరి కుమార్, బోనగాని సారయ్య, ముంజాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

వెంకటాపూర్,న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన రామిడి రాజిరెడ్డి(48) అనే రైతు విషపురుగు కాటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రాజిరెడ్డి వ్యవసాయ పనుల కోసం వెళ్లగా విషపురుగు కాటుకు గురైనాడు. గమనించని రాజిరెడ్డి మరుసటి రోజు అస్వస్థతకు గురికావడంతో 4వ తేదీన ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరీక్షలు చేపట్టిన వైద్యులు శరీరం పూర్తిగా విషపూరితంగా మారిందని వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లాలని సూచించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మేడారం ఆదాయం నుంచి జలాశయానికి 25 శాతం కేటాయించాలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానం


గోవిందరావుపేట,న్యూస్‌టుడే: మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరకు హాజరయ్యే లక్షలాది మంది భక్తజనుల తాగు, సాధారణ నీటి అవసరాలు తీర్చుతున్న లక్నవరం జలాశయం మరమ్మతులకు, అభివృద్ధికి జాతర ఆదాయం నుంచి 25 శాతం నిధులు కేటాయించాలంటూ పస్రా-3 ఎంపీటీసీ సభ్యురాలు మద్దినేని రామనర్సమ్మ, సర్పంచులు తాటి రమణ, జిమ్మ వరలక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయగా మండలసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గోవిందరావుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ జెట్టి సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామనర్సమ్మ, సర్పంచులు మాట్లాడుతూ నిధుల లేమి కారణంగా లక్నవరం జలాశయం కాలువల మరమ్మతులు చేయలేని దుస్థితి నెలకొన్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన చేస్తున్నామని చెప్పారు. జడ్పీటీసీ సభ్యురాలు నామవరపు విజయలక్ష్మి మాట్లాడుతూ దేవాదుల నీటిని లక్నవరం జలాశయంలోకి మళ్లిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చినప్పటికీ నేటికి ఆ హామీ నెరవేరలేదన్నారు. ఈ మేరకు దేవాదుల నీటిని లక్నవరం జలాశయానికి మళ్లించాలని సభ తీర్మానించినట్లు చెప్పారు. సర్పంచి రమణ, ఎంపీటీసీ సభ్యుడు కొత్తూరు వెంకట్రామయ్య మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నాణ్యత లేని గుడ్లు, అరటిపండ్లు సరఫరా చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై సమావేశానికి హాజరైన ఏటీడబ్ల్యూవో క్షేత్రయ్య బదులిస్తూ నాణ్యత లేని గుడ్లు, అరటిపండ్లు సరఫరా జరుగుతున్నట్లు ప్రజాప్రతినిధుల దృష్టికి వస్తే తనకు ఫిర్యాదు చేసినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్వాయి గ్రామంలోని గిరిజన బాలుర వసతిగృహంలో నీళ్లట్యాంకు నిర్మించి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యాడని రమణ చెప్పారు. ఆవసతిగృహాలకు గ్యాస్ పొయ్యిలు సరఫరా చేసిన ప్రభుత్వం గ్యాస్ సరఫరాను విస్మరించిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడంతో పస్రా గ్రామంతో పాటు చుట్టుపక్కల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచి జిమ్మ వరలక్ష్మీ, రామనర్సమ్మ సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూర్తి స్థాయిలో పని చేసే వైద్యాధికారిని నియమించాలని సభ తీర్మానించింది. మిషన్ భగీరథ పనులు చేస్తున్న గుత్తేదార్లు విచక్షణారహితంగా రోడ్ల వెంట గోతులు తవ్వి వదిలేస్తున్నారని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో వెంకటయ్య అన్నారు. సహకార బ్యాంకులో రైతులు చేసిన డిపాజిట్ల గడువు ముగిసి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ నేటికి చెల్లింపులు ఎందుకు చేయడం లేదంటూ సభ్యులు సంబంధిత అధికారిని ప్రశ్నించారు. వెంకటయ్య జోక్యం చేసుకొని బ్యాంకులో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించడమే కాకుండా సంబంధిత రైతులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేసి చెల్లింపులు వెంటనే చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులకు సంబంధించి వస్త్రం చాలినంతగా ఎందుకు సరఫరా చేయలేదని రమణ మండల విద్యాశాఖాధికారి దివాకర్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం సరఫరా చేసిన విధంగానే ఆయా పాఠశాలలకు వస్త్రాన్ని సరఫరా చేశామని, పై స్థాయిలో అవకతవకలు జరిగాయని దివాకర్ బదులిచ్చారు. ప్రతిసారి కుంటిసాకులు చెబుతూ సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేయాలని సభ తీర్మానించింది. సమావేశంలో తహసీల్దారు రవి రాజ్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



నీటిపారుదలశాఖ ఏఈని వివరణ కోరుతున్న జడ్పీటీసీ సభ్యురాలు

మత్తడి పోస్తున్న గుండ్లవాగు ప్రాజెక్టు

గుండ్లవాగు ప్రాజెక్టు,(గోవిందరావుపేట),న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్టు సోమవారం ఉదయం నుంచి మత్తడి పోస్తుంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 24 అడుగులు కాగా, ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం దాటి వరద ప్రవాహం వస్తుండటంతో ప్రాజెక్టు మత్తడి పోస్తుంది. ఉదయం 12 అంగుళాల మేర మత్తడి పోయగా సాయంత్రానికి వరద ఉధృతి కాస్త తగ్గి ఆరు అంగుళాల మేర మత్తడి ప్రవాహం కొనసాగుతోంది. నీటిపారుదలశాఖ గణాంకాల ప్రకారం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.43 టీఎంసీలు. ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాల్వల కింద సుమారు 4500 ఎకరాలు సాగవుతోంది. గుండ్లవాగు ప్రాజెక్టు మత్తడి పోస్తుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మత్తడి పోస్తుండడంతో ఖరీఫ్ సాగు పూర్తికావడంతో పాటు రబీలో కూడా కొంతమేర సాగు చేసుకొనే అవకాశం రైతులకు కలుగుతుంది.



మత్తడి పోస్తున్న గుండ్లవాగు ప్రాజెక్టు

కొనసాగుతున్న బొగ్గుల వాగు వరద ఉధృతి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగు వరద ఉధృతి సోమవారం కొనసాగింది. గత రెండు రోజులుగా ములుగు మండలం, కొత్తగూడెం మండలంలో కురుస్తున్న వర్షానికి వరద నీరంతా వచ్చి బొగ్గులవాగులో కలుస్తుంది. వాగుపై ఉన్న లోలెవల్ వంతెన మీదుగా వరద నీరు పొంగి ప్రవహిస్తుండటంతో అంకన్నగూడెం, జగ్గన్నగూడెం గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిచిపోయింది. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తప్పని పరిస్థితిలో ములుగుకు రావాల్సి ఉండగా పలువురు వాగు దాటారు..

CLASSIFIEDS

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO ... BABY CARE CENTERS ... IRON & CEMENT, EYE CARE, COOKING ... MESS ... OLOGY ... DELIVERY, HOME APPLIANCES, THANKS GIVING, LOSS & FOUND ... GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Innova- AP20W7108, M- 2005, Scarpio- AP15AG1, M-2007, For sale. Contact: 9393636465.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

సుప్రీం "ఇ" స్వచ్ఛమైన కోనసీమ కొబ్బరినూనె 30/100/200 ML బాటిల్స్‌కి ఏరియా వారీగా సబ్ డీలర్స్ కావలెను. Cell: 8466990883.

BUSINESS OFFER

తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఉంటూ పేపర్ ప్లేట్స్ తయారుచేసే మెషిన్లు కలవు. ముడిసరకు మేమే ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం, అగ్రిమెంట్ కలదు, Govt. రిజిస్ట్రేషన్. సాయి విగ్నేష్ ఏజెన్సీస్, ✆ 90302 18788, 888598884.

ఎలక్ట్రానిక్స్ & హోమ్‌నీడ్స్ ఫర్నీచర్ ప్రోడక్ట్స్‌ని మార్కెట్ చేయుటకు బిజినెస్ చేయగల ప్రమోటర్స్, గ్రూప్ లీడర్స్ కావలెను. Cont: 9100656568.

COMPUTER EDUCATION

ఫ్రీడమ్ ఆఫర్ PGDCA, Tally, బ్యూటీషియన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ, సర్టిఫికెట్ ఇవ్వబడును. 100 అడ్మిషన్లకు మాత్రమే. సంప్ర: మైండ్‌సాఫ్ట్ కంప్యూటర్స్, చౌరస్తా, Wgl. 9849691729.

EDUCATION

కేవలం 2 1/2 నెలల్లోనే ఇంటర్/డిగ్రీ, బి.టెక్, ఎమ్‌టెక్, MBA, M.Phil. P.HD. పూర్తి Eligible for Govt & Private Jobs. C/o. DSR కాలేజి, HNK 9346634381.

లైఫ్‌లైన్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో Admissions are in progress. GNM 3 సం॥రాల కోర్సు. విద్యార్హత: ఇంటర్, SC, ST, BC & మైనర్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ. సంప్ర॥ లైఫ్‌లైన్ హాస్పిటల్. # 2-4-152, పాత బస్‌డిపో, రాంనగర్, హన్మకొండ. సెల్: 9963050736.

HOME NEEDS

ఇంటిపై వాటర్ ట్యాంక్ నిండిపోయి నీరు వృధా పోకుండా ట్యాంక్ నిండగానే మోటర్ బంద్ అగు కంట్రోలర్స్ లభించును. ✆ 8464856262 HNK.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీలక్ష్మి హెల్త్ & హోంకేర్ సర్వీస్, వృద్ధులకు మంచానున్న వారికి ఆయా/ అటెండర్ల సేవలు మీ ఇంటివద్ద/ మా హోంలో (పార్ట్ టైం సర్వీస్) సౌకర్యం కలదు. ✆ 9676313730/ 8520951157

REAL ESTATE

FLAT FOR SALE

వరంగల్‌లోని రామన్నపేట నందు గల విక్టరి ఎవెన్యూ అపార్ట్‌మెంటు నందు B బ్లాక్, 3rd ఫ్లోర్, F.No-311 అమ్మబడును. 2BHK, పూజగది With Car Parking. Cont: 9849544437.

HOUSE FOR SALE

Uppal HMDA Housing Projects 20 Acres 230 Duplex & INDP Villas Near to Warangal Highway. 80% Bank Loan. ✆ 9700000171/8143697697.

తొర్రూరు, బీరప్పనగర్ నందు 180 గ॥లో 2 ఫ్లోర్ బిల్డింగ్ క్రొత్తది అమ్మకానికి కలదు. W/f, 30ft Road With ఇంటీరియర్స్. Ph: 9177110386.

PLOT FOR SALE

Plot for Sale in Ghatkesar Beside Outer Ring Road, Near Infosys Company Hyd, Per Sq.Yard Rs. 4200/- Only, ✆ 8328353618

Hyd- యాదగిరిగుట్ట దగ్గర్లో వంగపల్లి నుండి మోటకొండూర్ మండల హెడ్ క్వార్టర్స్ ఆనుకొని DTCP అప్రూవ్డ్ Plots చ॥గ॥ 1899/- స్పాట్ రి॥ వాయిదాల పద్ధతి కలదు. శ్రీనివాస్: 9348012357

WGL దేశాయిపేట్ రెండవ బొడ్రాయి దగ్గర 220 చ॥గ॥ E/F, అయ్యప్పగుడి దగ్గరలో N/E ఫేసింగ్ 330 చ॥గ॥ 60 'ft' రోడ్‌కి ప్లాట్స్ గలవు. 9849091107, 9490606947.

HNK NGO'S కాలని రోడ్, రాఘవేంద్రనగర్ Ph-II రోడ్ నెం: 15 లో (43 1/2X 51.3) 248 గ॥ వెస్ట్ ఫేస్ KUDA LRS గల ప్లాట్ అమ్మబడును. 9949023355, 9395511112.

హన్మకొండలోని భీమారం గ్రామపంచాయతి దగ్గరలో విద్యాన్ జూనియర్ కాలేజ్ రోడ్‌లో 316 గజాల North Face స్థలం వెంటనే అమ్మకానికి కలదు.(ల్యాండ్‌మార్క్- తాటికల్లు మండువ). Cell: 95539 13919.

700 గ॥ DTCP 3 ప్రక్కల రోడ్ గల Open Plot వంగపల్లి, వరంగల్ హైవే & యాదాద్రి అతి చేరువలో, నో బ్రోకర్స్. ✆ 8985366669/ 7032083437

LEASE / RENT

బొల్లికుంట వాగ్దేవి కాలేజ్‌కి 1 K.M దూరంలో గల Godawn 11000 Sft గల Godawn Lease కి గాని, Rentకి ఇవ్వబడును. Cont: 8978635553.

TO-LET

COMMERCIAL

సుబేదారి జులైవాడ మెయిన్ రోడ్డులో APGVB BANK ఎదురుగా కమర్షియల్ కాంప్లెక్స్ 1750 SFTల బిల్డింగ్ షోరూంలకు, ఆఫీసు, హాస్పిటల్,బ్యాంక్, హాస్టల్‌లకు కిరాయికి ఇవ్వబడును. 9440325787.

దేశాయిపేటలో మంచి రన్నింగ్‌లో ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ 1700 S.Ft. మొత్తం లేదా 1000 S.Ft., 700 S.Ft. విడివిడిగా ఇవ్వబడును. Offices, Banks, Colleges, Chitfunds కిరాయికి లేదా లీజుకు ఇవ్వబడును. 9849434253.

HNK రాంనగర్ శ్రీనివాస హార్ట్ హాస్పిటల్ దగ్గర 2 ఫ్లోర్స్ 10 రూమ్స్ Hospitals/ Chitfunds/ Tutorials కు కిరాయికి ఇవ్వబడును. సంప్ర: 9010527565.

SITUATIONS VACANT

"డైరెక్టుజాబ్" నర్సింగ్‌కేర్, పేషెంట్‌కేర్ (M/F) స్టాఫ్ కావలెను. జీ॥ 8000 - 16000/- వరకు ఉచిత వసతి + భోజనం చదువున్నా/ లేకున్నా 9966310431/ 9010137634.

Hyd లోని ప్రముఖ లి॥ కం॥లకై హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్, సూ॥వైజర్స్ కా॥. జీ: 13-18 వేలు. రూం+మీల్స్ ఫ్రీ. చదువులేకున్నా జాబ్. ESI, PF సౌకర్యం. సంప్ర: 7993026169.

HYD 5 స్టార్ హోటల్‌లో పనిచేయుటకు హెల్పర్స్, సర్వీస్ బాయ్స్ కావలెను. జీతం: 6వే- 12వేలు. Age: 18-25 రూం+ మీల్స్ ఫ్రీ. బస్‌పాస్ ఫ్రీ. ✆ 9581678034/ 8639879970

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 9573602911/ 8341826233.

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపనీలో పనిచేయుటకు ఏరియాల వారిగా Agents కావలెను. (Salary 10,000 to 25,000) Cell: 8317680173.

S.K.V.R. కంపెనీలో పనిచేయుటకు B.Sc (కెమిస్ట్రీ), ITI ఆల్ ట్రేడ్స్, హెల్పర్స్, ప్యాకింగ్‌బాయ్స్, సూపర్‌వైజర్, లేడి టెలికాలర్స్ కావలెను. జీతం: 10,000/- - 17,000/- PM డైరెక్ట్ సంప్ర॥ ✆ 9705549598/ 9553632447.

Wanted Ladies Tailors, Stiching, Cutting Lady Master for our Shaheda Dzyne Ladies Tailor, Raipura, Hnk. Cell: 9652771511.

ప్రముఖ జిమ్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన జిమ్ ట్రైనర్స్, అసిస్టెంట్స్ మరియు డాన్స్ మాస్టార్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి. సెల్: 9440713300.

ఆయా కావలెను. హన్మకొండ ఇంట్లో 1 సం॥, 4 సం॥ పిల్లలను చూసుకుంటు ఇంట్లో పనిచేయడానికి Cnt: 9052526111, 9052526222.

రొజరి పాఠశాల గొల్లపల్లి పెట్రోల్ పంపు KUC రోడ్డులో పనిచేయుటకు భార్య, భర్తలు జంట కావలెను. వసతి & పిల్లలకు (02) ఉచిత విద్య. జీ: 5 వేలు+ 4 వేలు @ 8886061234, 9885552497.

Wanted immediatly Biology (VI- X EM) & I- X English Teachers to Teach in Rosary School, HNK. Sal: Negotiable. @ 8886061234.

హైదరాబాద్ 5 స్టార్ హోటల్స్‌కు ఉత్సాహవంతులైన సర్వీస్‌బాయ్స్, హెల్పర్స్ కావలెను. జీ:12,000- 14,000/-. రూం+భోజనం సౌకర్యం ఫ్రీ. ✆ 9030276056/ 9666300736.

ప్రముఖ పక్షపత్రికకు చురుకైన ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్- అర్హత: ఇంటర్ - డిగ్రీ, Age: 20 - 30 సం. లోపు. స్వంత 2 వీలర్. ✆ 98481 13036, 99891 13036.

ధరణి ప్రాజెక్టు మహబూబాబాద్ నందు "ఫీల్డ్ ఆఫీసర్స్"గా పనిచేయుటకు మార్కెటింగ్ అనుభవం కలిగిన యువతీ, యువకులు కావలెను. జీ: 20 వేలు మరియు గిఫ్ట్స్, ఇన్సెంటివ్స్ కలవు. 9133271155, 9010353353

ట్రాక్టర్ డ్రైవర్ కావలెను. మా పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేయుటకు అనుభవంగల వారు సంప్ర॥ జీతం + వసతి ✆ 9959074762/ 9502093165

వంటమనిషి కావలెను. బ్రాహ్మణులు, వైశ్య, మర్వాడి వారు కావలెను. Hyd. Cont: 9959710502.

హన్మకొండలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం 12000+ ESI+ PF సౌకర్యం కలదు. సంప్ర: 9393599119.

TOURS & TRAVELS

కావేరి పుష్కరాలు మొదటిరోజు శ్రీరంగపట్నంలో స్నానమాచరించే 20 క్షేత్రాల గోవా & కర్ణాటకకు AC యాత్ర SEP 4న & రామేశ్వరం 30 క్షే॥త్రాలు AC యాత్ర SEP 15న దసరాకి SEP 26న పూరి 5రో॥ యాత్ర లక్ష్మి టూర్స్. 98662 46466.

కాశీయాత్ర- కాశీ, ప్రయాగ,నైమిశారణ్యం,గయ 9రో॥వ॥భో॥ 6000/- Oct-2 రామేశ్వరం,కన్యాకుమారి,మధురై,కంచి 8రో॥ 6200/-వ॥భో॥ 7-9&20-9. సత్యసాయి సేవాసమాజ్ 9618933189

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



అనుక్షణం.. అప్రమత్తం


వరద నీటిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న రెస్క్యూ టీం సభ్యులు

వాజేడు, న్యూస్‌టుడే: హోరున ఎగిసిపడుతున్న వరద నీరు.. ఉద్ధృతంగా ఉరకలెత్తుతున్న ప్రవాహం.. వడిగా ప్రవహిస్తున్న నీటిలో పర్యాటకుల కోలాహలం.. వారిని అనుక్షణం అప్రమత్తం చేసేందుకు రెస్క్యూ టీం(గజ ఈతగాళ్లు) విధులు ఇదీ ప్రముఖ పర్యాటక క్షేత్రం వద్ద పరిస్థితి. జలపాతం వద్ద పర్యాటకులు ఉత్సాహంతో చేస్తున్న పనులు అటవీశాఖ, రెస్క్యూ టీం సభ్యులకు తలనొప్పిగా మారుతున్నాయి. ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లరాదంటూ పర్యాటకులను వారించడానికి ప్రయత్నిస్తే సిబ్బందితో సందర్శకులు వాదనకు దిగుతున్నారు. జలపాతం వరదనీటిలో లోతైన ప్రాంతానికి వెళ్లరాదంటూ రెస్క్యూ టీం హెచ్చరికలను ఖాతరు చేయకుండా కొందరు పర్యాటకులు వాగ్వావాదానికి దిగుతున్నా సంయమనం పాటించినా ప్రమాదాలు తప్పడం లేదు. ఆదివారం నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి వరద నీటిలో ఈత కొడుతూ ప్రమాదపు అంచుల నుంచి బయటపడ్డాడు. అప్రమత్తంగా ఉన్న రెస్క్యూ టీం సభ్యులు సకాలంలో స్పందించి బయటకు లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. గత నెలలో ఇదే మాదిరిగా వరంగల్ పట్టణానికి చెందిన ఓ బాలిక వరద నీటిలో మునిగిపోతుండడంతో బంధువుల అరుపులతో స్పందించిన రెస్క్యూ టీం సభ్యుడు బయటకు తీశాడు. ఇప్పటి వరకు బొగత జలపాతం వద్ద ప్రమాదాల్లో నలుగురు పర్యాటకులను రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఇంత జరుగుతున్నా పర్యాటకుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

గొడవ కొస్తున్నా భరిస్తున్నాం

వరద నీటిలోకి వెళ్లవద్దంటూ పర్యాటకులను హెచ్చరిస్తే గొడవ కొస్తున్నారు.. కొందరైతే అస భ్యంగా మాట్లాడుతున్నారు.. అయినా భరించి వరద నీటిలోనే ఉంటూ సందర్శకులు లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా కట్టడి చేస్తున్నామని రెస్క్యూ టీం సభ్యులు చెబుతున్నారు. కనురెప్ప వాల్చకుండా పర్యాటకులను గమనిస్తున్నా కొందరు కన్నుగప్పి లోతైన ప్రాంతానికి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.

ఇనుప వలతోనే పర్యాటకుల అదుపు

పర్యాటకులు వరద నీటిలోకి వెళ్లకుండా గత నెలలో ఏర్పాటు చేసినట్లుగా ఇనుప వలను అమర్చినట్లయితే సందర్శకులను అదుపు చేసేందుకు అవకాశముందని సిబ్బంది పేర్కొంటున్నారు. కొందరి అత్యుత్సాహాన్ని గుర్తించిన సందర్శకులు ఆందోళనతో అటవీ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. బొగతజలపాతం అంచున ఏర్పాటు చేసిన రాతికట్టపై వలను ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులు లోతైన వరద నీటిలోకి వెళ్లకుండా నిరోధించేందుకు అవకాశముందని అంటున్నారు.

పర్యాటకులను కట్టడి చేసేందుకు చర్యలు: శంకర్, అటవీ క్షేత్రాధికారి

వరద నీటిలో పర్యాటకులు ప్రమాదాలకు గురి కాకుండా అనుక్షణం చర్యలు చేపడుతున్నాం. పర్యాటకులకు ఇబ్బంది లేకుండా జలపాతంలో ఆహ్లాదం పొందేందుకు చర్యలు తీసుకుంటూనే సందర్శకుల రక్షణకు ఏర్పాట్లు చేపడుతున్నాం.

ప్రతి పోలీసు అధికారి అంకితభావంతో పనిచేయాలి

ఎస్పీ భాస్కరన్


ఎస్పీకి గోడు చెబుతున్న బాధితుడు

భూపాలపల్లి క్రైం, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి 16 మంది బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిర్యాదులు ఇచ్చారు. వారి సమస్యలను సానుకూలంగా వింటూ కొన్ని సమస్యలను సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే ఫోన్ చేసి సాధ్యమైనంత మేరకు బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ భాస్కరన్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల్లో వాస్తవమని తేలితే చట్టపరంగా న్యాయం చేసేందుకు అధికారులు కృషిచేయాలని, ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. చాలా కాలం నుంచి పరిష్కారం కాని ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాధితుల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరంగా వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజా దివస్ ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయటం జరుగుతుందని, ప్రజలకు, బాధితులకు మెరుగైన సేవలు పోలీసు అధికారులు అందించాలన్నారు.

మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ మురళి

గణపురం,న్యూస్‌టుడే: మిషన్ భగీరథ పథకంలో భాగంగా గణపసముద్రంలో నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను జిల్లా కలెక్టర్ మురళి సోమవారం పరిశీలించారు. చెరువులో జరుగుతున్న ఇంటెక్ వెల్ పనులను స్వయంగా పరిశీలించారు. ఎప్పుడో ప్రారంభంకావాల్సిన వాటర్ గ్రిడ్ నిర్మాణం ఇంకా పూర్తి కానందుకు ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పనులను వేగవంతం చేసి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు నీరందించాలని ఆదేశాలిచ్చారు. రూ. 254 కోట్లతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని పనుల్లో ఇంత జాప్యం జరిగితే ఎలా అని గుత్తేదారును ప్రశ్నించారు. అదేవిధంగా గాంధీనగరం గుట్టపై ఉన్న పంప్‌హౌజ్, ఫిల్టర్ బెడ్‌పనులను కూడా పరిశీలించారు. అక్కడ కూడా పనులు మందకొడిగా ఉండడంతో మండిపడ్డారు. పనుల్లో వేగం పెంచకపోతె వేరే అధికారులను ప్రత్యేకంగా నియమించాల్సి వస్తుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు


కాటారం,న్యూస్‌టుడే: శ్రీ కృష్ణభగవాణుడి పుట్టినరోజు సందర్భంగా సోమవారం శ్రీ కృష్టాష్టమి వేడుకలు కాటారంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మికత వెల్లివిరియగా వీధుల్లో ఉట్టికొట్టే కార్యక్రమం చిన్నారులు, యువతలో ఉత్సాహాన్ని నింపింది. దేవాలయాలతోపాటు పాఠశాలల్లో ఉత్సవాలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల సంపత్, కన్వీనర్ కొంరయ్య, కాటారం అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, స్వామి యాదవ్, నాయకులు సమ్మయ్య, దేవేందర్, రామన్న, ఐలయ్య, రాజయ్య, మల్లయ్య, గట్టయ్య, లచ్చయ్య, మల్లేశ్, తెరాస, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఉత్తములు వీరే

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పంద్రాగస్టు వేడుకల సందర్భంగా అందించే జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికైన వారి పేర్లను సోమవారం కలెక్టర్ ఆకునూరి మురళి ప్రకటించారు. వీరికి మంగళవారం భూపాలపల్లిలోని సింగరేణి మైదానంలో నిర్వహించే జెండా పండుగ వేడుకల అనంతరం స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రశంసాపత్రాలు అందిస్తారు. జిల్లాలో 119 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో ఇద్దరు రైతుల పేర్లు ఉండటం విశేషం.

రెవెన్యూ శాఖ.. ఎల్. జివాకర్‌రెడ్డి(తహసీల్దార్, గణపురం), శివకుమార్(తహసీల్దార్, వెంకటాపూర్), ఎండి నసీరోద్దీన్(డిప్యూటీ తహసీల్దార్, జెన్‌కో), ఎం. శివ(కలెక్టర్ సీసీ), రజాక్(సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్), పి. ప్రసాద్(సీనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, ములుగు) మను సూరజ్(జూనియర్ అసిస్టెంట్, భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయం), ఎస్. శరద్‌చంద్ర(సీసీ, జాయింట్‌కలెక్టర్), శ్రీకాంత్(సీసీ, సబ్ కలెక్టర్), సాగర్(జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్), మల్లయ్య(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, కలెక్టరేట్), భద్రయ్య(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, కలెక్టరేట్), అశోక్(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, జేసీ క్యాంప్ ఆఫీస్), రమేశ్(డ్రైవర్, జేసీ క్యాంప్ ఆఫీస్), పి. నాగమణి(వీఆర్‌ఏ, రేగొండ)



పంచాయతీరాజ్ శాఖ.. ఎన్. వసుమతి(తాడ్వాయి ఎంపీడీవో), ఎండి. రహీమోద్దీన్(పంచాయతీ కార్యదర్శి, ములుగు), జి. సాగర్(సర్పంచి, ములుగు), బుచ్చిరెడ్డి(సీనియర్ అసిస్టెంట్, డీపీవో కార్యాలయం), ఎన్. విజయ్‌కుమార్(సూపరింటెండెంట్, చిట్యాల), ఎండి. షాజహాన్(సీనియర్ అసిస్టెంట్, మొగుళ్లపల్లి), జి. విజయమోహన్(జూనియర్ అసిస్టెంట్, ములుగు) ఎస్. మల్లయ్య(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, గర్మిళ్లపల్లి, చిట్యాల మండలం)

వ్యవసాయ శాఖ: కె. సుధాకర్(ఏడీఏ, ఏటూరునాగారం), ఎస్ గోపీనాథ్(ఏఈవో, చిట్యాల), తోట రమేశ్(రైతు, వాడగూడెం, మంగపేట మండలం), బొమ్మరబోయిన వీరభిక్షం(రైతు, మొద్దులగూడెం, గోవిందరావుపేట మండలం)

పశుసంవర్ధక శాఖ: డాక్టర్ టి. పార్థసారథి(లక్ష్మీందేవీపేట, వెంకటాపూర్ మండలం), జె. సుమన్‌జిత్ర(ఎల్‌ఎస్‌ఎ, మదనపల్లి, ములుగు మండలం)

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ: డి. సహారబంధం(జూనియర్ అసిస్టెంట్, జిల్లా బీసీవెల్ఫేర్ కార్యాలయం)

పౌరసరఫరాల శాఖ: పి. అనిల్‌కుమార్(ఏఎస్‌వో, భూపాలపల్లి), కె. సత్యనారాయణ(డిప్యూటీ తహసీల్దార్, భూపాలపల్లి)

అగ్నిమాపక శాఖ: ఎం. భాస్కర్(ఫైర్‌మెన్, ములుగు)

పౌరసంబంధాల శాఖ: ఆర్. సుదర్శన్(ఏపీఎస్, భూపాలపల్లి), ఎం. వీరాంజనేయులు(టైపిస్టు, భూపాలపల్లి)

నీటిపారుదల శాఖ: వలీం మహ్మద్(ఏఈఈ, ములుగు), ఎ. ప్రవల్లిక(ఏఈ, ములుగు), పి. శ్యాం(జూనియర్ అసిస్టెంట్, ములుగు), సీహెచ్ రాము(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, ములుగు)

మున్సిపల్ శాఖ: ఎం. రవీందర్(భూపాలపల్లి నగర పంచాయతీ కమీషనర్)

మిషన్ భగీరథ: ఎం. పరమేశ్వరీ(డీఈఈ, భూపాలపల్లి), ఎస్ ఉప్పయ్య(ఏఈఈ, భూపాలపల్లి)

ప్రణాళిక శాఖ: ఎ. నాగేశ్వర్(ఎంపీఎస్‌వో, మొగుళ్లపల్లి), డి. జ్యోతి(ఎంపీఎస్‌వో, గోవిందరావుపేట)

పోలీస్ శాఖ..

కేఆర్‌కే ప్రసాద్(కాటారం డీఎస్పీ), జి. మోహన్(చిట్యాల సీఐ), జి. కృష్ణప్రసాద్(వాజేడు ఎస్ఐ), ఎన్. శ్రీనివాస్(సూపరింటెండెంట్, ఎస్పీ కార్యాలయం), మహ్మద్ ఫసియోద్దీన్(ఎస్పీ సీసీ), వి. గిరి(సీనియర్ అసిస్టెంట్, ఎస్పీ కార్యాలయం), పి. అరుణ్‌కుమార్(ఆర్ఐ, డీపీఆర్), ఎం. నరేశ్(పలిమెల ఎస్ఐ), వి. ఉదయ్‌కుమార్(మహదేవ్‌పూర్ ఎస్ఐ), ఎన్. సధాకర్(రేగొండ ఎస్ఐ), ఎస్. కిరణ్‌కుమార్(ఏటూరునాగారం ఎస్ఐ), బి. సతీశ్(ఆర్‌ఎస్ఐ, డీఏఆర్), కె. యాదగిరి(ఏఎస్ఐ తాడ్వాయి), ఎం. రమేశ్(హెడ్ కానిస్టేబుల్,డీఏఆర్), జి. రమేశ్(హెడ్‌కానిస్టేబుల్, భూపాలపల్లి), డి. శ్రీనివాస్‌రెడ్డి(కానిస్టేబుల్, డీఏఆర్), బి. యెర్రమళ్ల(కానిస్టేబుల్, డీఏఆర్), వీరన్న(కానిస్టేబుల్, జిల్లాగార్డ్), ఎండి. సీరాజ్(కానిస్టేబుల్, జిల్లాగార్డ్), వి. రాజేందర్(కానిస్టేబుల్, జిల్లాగార్డ్), పి. రాజన్న(కానిస్టేబుల్, భూపాలపల్లి), బి. రమేశ్(కానిస్టేబుల్, పేరూరు), ఎస్. గోపాల్(కానిస్టేబుల్, పలిమెల), పి. బాలాజి వరప్రసాద్(ఇంటిలెజెన్స్ సీఐ), కె. నరేందర్ (ఇంటిలిజెన్స్ హెడ్‌కానిస్టేబుల్), ఎం. ఈశ్వరయ్య(ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్)

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ..



డాక్టర్ రవిప్రవీణ్ రెడ్డి(చిట్యాల సీహెచ్‌సీ సూపరింటెండెంట్), డాక్టర్ బి. వెంకటేశ్(వెంకటాపురం పీహెచ్‌సీ), డాక్టర్ శ్యామ్(ఎధిర పీహెచ్‌సీ), డాక్టర్ మోహన్(వాజేడు పీహెచ్‌సీ), డాక్టర్ నరేశ్(ఏటూరునాగారం సీహెచ్‌సీ), డాక్టర్ లావణ్య(ములుగు ఏరియా ఆసుపత్రి), డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు(మంగపేట పీహెచ్‌సీ), ఇంద్రావతి(స్టాఫ్ నర్స్, వెంకటాపురం), రాణి(స్టాఫ్‌నర్స్, చిట్యాల సీహెచ్‌సీ), శారద(ల్యాబ్ టెక్నీషియన్, ఎధిర పీహెచ్‌సీ), ఇ. సదయ్య(ఫార్మసిస్టు, గణపురం పీహెచ్‌సీ), సరోజన(భూపాలపల్లి-1 ఏఎన్ఎం), ఎన్ విజయనిర్మల(ఆశ కార్యకర్త, కమలాపూర్ సబ్‌సెంటర్), ఎస్ భాగ్యమ్మ(ఆశ, కాల్వపల్లి సబ్‌సెంటర్), రేపూరి సంపత్(ఈఎంటి, 108 తాడ్వాయి), కె. రమేశ్(పైలట్, 108 తాడ్వాయి)

ఎక్సైజ్ శాఖ: రాణాప్రతాప్‌సింగ్(కానిస్టేబుల్, భూపాలపల్లి)

రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ: తస్లీం మహ్మద్(సబ్ రిజిస్ట్రార్, ములుగు)

రోడ్లు భవనాల శాఖ: ఎస్. రమేశ్(డీఈఈ, భూపాలపల్లి), సీహెచ్. విజయ్‌కుమార్(ఏఈ, మహదేవ్‌పూర్)

ఆడిట్ శాఖ: బి. లింగయ్య(సీనియర్ ఆడిటర్, భూపాలపల్లి)

సర్వే , ల్యాండ్ రికార్డ్స శాఖ: కె. శ్రీదేవి(జూనియర్ అసిస్టెంట్, భూపాలపల్లి)

ఖజానా శాఖ: రసూల్(ఎస్‌టీవో, భూపాలపల్లి), జి. వేణు(సీనియర్ అకౌంటెంట్, భూపాలపల్లి), రబియా బేగం(ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, భూపాలపల్లి)

స్త్రీశిశు సంక్షేమశాఖ: బి. రాజమణి(ఏటూరునాగారం సీడీపీవో), పి. ఝాన్సీ(సూపర్‌వైజర్, భూపాలపల్లి), కోమల(అంగన్‌వాడీ టీచర్, చిట్యాల)

గ్రామీణాభివృద్ధి శాఖ..

ఎండీ. అలీం(ఏపీవో, రేగొండ), నితిన్ కుమార్(ఈసీ, కాటారం), రాజు(ఏపీవో, గోవిందరావుపేట), సర్దార్(కంప్యూటర్ ఆపరేటర్, వెంకటాపూర్), నరేందర్(కంప్యూటర్ ఆపరేటర్, వెంకటాపూర్), వేణు(కంప్యూటర్ ఆపరేటర్, తాడ్వాయి), కె. శ్రీనివాస్(ఫీల్డ్ అసిస్టెంట్, పస్రా), పి. శ్రీనివాస్(ఫీల్డ్‌అసిస్టెంట్, తిర్మలగిరి)

అటవీశాఖ..

డి. శంకర్(ఎఫ్ఆర్‌వో, వెంకటాపురం), పి. భిక్షపతి(ఎఫ్ఆర్‌వో, భూపాలపల్లి), సయ్యద్ ఇక్రమోద్దీన్(డిప్యూటీ రేంజ్ అధికారి, చెల్పూరు), బి. రాధిక(ఎఫ్ఆర్‌వో, కొయ్యూరు), సీతల్(ఎఫ్ఆర్‌వో, తాడ్వాయి), బి. సక్రం(డిప్యూటీ రేంజ్ అధికారి, మహాముత్తారం), జి. నాగేశ్వర్‌రావు(ఎఫ్ఆర్‌వో, ములుగు), ఎం. వంశీకృష్ణ(ఎఫ్ఆర్‌వో, పస్రా)

ఎస్సీ సంక్షేమ శాఖ..

జీకే. శ్రీనివాస్(బాలుర హాస్టల్ వార్డెన్, వాజేడు), పి. అశోక్(జూనియర్ అసిస్టెంట్, ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం, భూపాలపల్లి), కె. సుకన్య(వార్డ్ ఉమెన్, బాలికల హాస్టల్, ములుగు), జయశ్రీ(బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్, చిట్యాల), ఎ. శంకర్(జూనియర్ లెక్చరర్, జాకారం కళాశాల)

నేటి స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ఇవే!

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను సింగరేణి యాజమాన్యం పూర్తి చేసింది. వేడుకలను ఈసారి స్థానిక మిలినీయం క్వార్టర్స్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం పీ కొండయ్య హాజరై ఉదయం 9గంటలకు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. అనంతరం ఆయా పాఠశాల విద్యార్థులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తారు. తర్వాత ముఖ్యఅతిథి ప్రసంగం, ఉత్తమ కార్మికులకు సన్మానం చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

'నూతన నిర్మాణాలు చేయరాదు'

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: ఓసీపీ-2 ఏర్పడే గడ్డిగానిపల్లి ప్రాంతంలో ఏలాంటి నూతన నిర్మాణాలు చేపట్టవద్దని ఓసీపీ గ్రూపు ఏజెంట్ రఘుపతి, ఏరియా ఎస్టేట్ అధికారి గంగన్నలు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఓసీపీ-2 దగ్గర్లో నిర్మాణాలు చేపట్టడం మూలంగా నష్టపోతారని పేర్కొన్నారు. ఎవరి మాటలు నమ్మకూడదన్నారు. గడ్డిగానిపల్లి గ్రామంలో సర్వేలు జరుగుతున్నాయన్నారు. కుటుంబ వివరాలను కూడా సేకరిస్తున్నారని తెలిపారు. ఆదార్, తదితర కార్డులను సర్వే చేస్తున్న వారికి చూపించాలన్నారు. సర్వేలు తొందర్లోనే పూర్తి అవుతాయని వెంటనే నష్ట పరిహారం అందుతుందన్నారు.

16నుంచి 'స్వచ్ఛ పఖ్‌వాడా'

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: ఈనెల 16వ తేదీ నుంచి సింగరేణిలో 'స్వచ్ఛ పఖ్‌వాడా' కార్యక్రమాన్ని పక్షం రోజులు నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం పి కొండయ్య తెలిపారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మాదిరిగా స్వచ్ఛ పఖ్‌వాడా చేపట్టనున్నట్లు తెలిపారు. పరిశుభ్రత, మొక్కల పెంపకం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీ, రోడ్లు, ఆసుపత్రి పరిసరాలు, తదితర ప్రాంతాలలో పరిశుభ్రత చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 28, 29వ తేదీల్లో ఏరియాలో ప్రత్యేకంగా స్వచ్ఛ పఖ్‌వాడా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సింగరేణి ఉత్తమ కార్మికులు వీరే



ఏరియా ఉత్తమ ఉద్యోగి సంజీవరెడ్డి

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం భూపాలపల్లి ఏరియాలో ఉత్తమ కార్మికులను ఎంపిక చేసింది. ఆరు నెలల పాటు ఎక్కువ హాజరు శాతం ఉన్న కార్మికులను ఎంపిక చేసి సోమవారం ప్రకటించింది. కేటీకే 1వగనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ పురుషోత్తం 149 ప్రమాద రహిత హాజర్లను పూర్తి చేశాడు. ఇదే గనికి చెందిన జనరల్ మజ్దూర్ వీసాల వెంకటేశ్వర్లు 119 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేశాడు. కేటీకే ఓసీపీలో ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న షర్ఫొద్దీన్ 145 ప్రమాద రహిత హాజర్లు, ఇదే గనికి చెందిన అన్వర్‌పాషా ఈపీ ఆపరేటర్ 149 ప్రమాద రహిత మస్టర్లు పూర్తి చేశాడు. కేటీకే 5వగనికి చెందిన ఎస్‌డీయల్ ఆపరేటర్ లక్కాకుల శ్రీనివాస్ 146 ప్రమాద రహిత మస్టర్లు, ఇదే గనికి చెందిన కోల్‌కట్టర్ కొమ్మాల సత్యనారాయణ 149 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేశాడు. కేటీకే 6వగనికి చెందిన సపోర్టుమెన్ సూర మొగిళి 137 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేశాడు. ఇదే గనికి చెందిన ఎస్‌డీయల్ ఆపరేటర్ సాంబశివరావు 140 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేశాడు. కేటీకే యైటింక్లైన్‌కు చెందిన ఆకుల రమేష్ ప్రైన్‌మెన్ 105 ప్రమాద రహిత హాజర్లను పూర్తి చేశాడు. ఇదే గనికి చెందిన ఎలక్ట్రిషియన్ బొల్లి శ్రీనివాస్ 140 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేశాడు.

ఉత్తమ సూపర్‌వైజర్

కేటీకే 5వగనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ జాలిగపు సాంబయ్య 154 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేసి ఏరియాలో బెస్ట్ సూపర్‌వైజర్‌గా ఎంపికయ్యాడు. వీరందరినీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున స్థానిక మిలినీయం క్వార్టర్స్ క్రీడా మైదానంలో జీఎం కొండయ్య చేతుల మీదుగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు.

ఏరియా ఉత్తమ ఉద్యోగిగా సంజీవరెడ్డి

భూపాలపల్లి ఏరియా ఉత్తమ ఉద్యోగిగా కేటీకే 6వగనికి చెందిన హెడ్ ఓవర్‌మెన్ సంజీవరెడ్డి ఎంపికయ్యాడు. గత మూడేళ్లుగా సగటున 281 ప్రమాద రహిత హాజర్లు పూర్తి చేశారు. ఈయనను కొత్తగూడెంలో జరుగు సెంట్రల్ పంక్షన్‌లో సింగరేణి ఛైర్మన్ చేతుల మీదుగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రాజేంద్రకుమార్ తెలిపారు.

సీఐటీయూ మహాసభల విజయవంతానికి పిలుపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సీఐటీయూ రాష్ట్ర 14వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు టి. రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 21, 22 తేదీల్లో సెంటినరీకాలనీలో నిర్వహించనున్న సభలకు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రచార గోడప్రతిని స్థానిక శ్రామిక భవన్‌లో సోమవారం విడుదల చేశారు. 1970లో ప్రారంభమయిన సీఐటీయూకి అనుబంధంగా 1978లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భవించిందని, ఇప్పటి వరకు 13 రాష్ట్ర మహాసభలను నిర్వహించుకున్నామని తెలిపారు.





మానుకోట గడ్డ..

బాస్కెట్‌బాల్ అడ్డా..!

జాతీయస్థాయిలో సత్తాచాటుతున్న క్రీడాకారులు

మానుకోట, న్యూస్‌టుడే

రాష్ట్రంలో మానుకోట పేరు చెబితే బాస్కెట్‌బాల్‌కు అడ్డాగా పిలుస్తారు..! అర్ధశతాబ్ద కాలంగా జాతీయస్థాయిలోనే మానుకోట ప్రాంతానికి ఈ క్రీడలో ప్రత్యేక గుర్తింపు ఉంది. అనేకమంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులు తమ ప్రతిభతో జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. బంగారు పతకాలను సాధించి క్రీడారంగంలో ఈ ప్రాంతానికి వన్నె తెచ్చారు. పలువురు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులుగా, బ్యాంకింగ్, రైల్వే, పోలీసు శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు తమ పాఠశాలల్లో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తున్నారు. వీరిలో కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం ఉన్నారు. ఐతే ఇంత ఘనచరిత్ర కలిగిన క్రీడారంగ అభివృద్ధికి జరుగుతున్న కృషి మాత్రం తక్కువే. బాస్కెట్‌బాల్ క్రీడాకారుల అభివృద్ధికి ఇకనైనా కృషి జరగాల్సిన అవసరముంది. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ క్రీడాశిక్షణ స్థానిక జూనియర్ కళాశాల బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణంలో నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఎంతో మంది ఔత్సాహిక క్రీడాకారులకు ఈ ఆటలో నైపుణ్యాలను నేర్పుతూ రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. పలువురు క్రీడాకారుల సహకారంతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు.

1960 దశకంలో శ్రీకారం..

అప్పట్లో హైదరాబాద్ లాంటి నగరాలకే పరిమితమైన బాస్కెట్‌బాల్ మానుకోట లాంటి గ్రామీణ ప్రాంతానికి రావడానికి 1960 దశకంలోనే బీజం పడింది. ఇందుకు ప్రధాన కారణం ఆనాడు స్థానిక కంకరబోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాంచందర్ కృషి మరువలేనిది. ఆయనను క్రీడాకారులంతా చందర్‌సార్ అని గౌరవంగా పిలిచేవారు. అన్ని ఆటల్లో శిక్షణ ఇవ్వడంలో ఆయన నిపుణుడు. అప్పట్లో కబడ్డీ లాంటి క్రీడలే ఉండేవి. బాస్కెట్‌బాల్‌ను కూడా ప్రవేశపెట్టి ఆయన ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులను ప్రోత్సహించారు. ఇందుకు .లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి ఎంతో సహకారమందించారు.

ఎందరినో తీర్చిదిద్దిన ప్రాంగణం..

మానుకోట బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణం ఎందరినో ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దింది. మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ మెరుగు సత్యనారాయణ, ప్రస్తుత జిల్లా అసోసియేషన్ బాధ్యుడు ముల్లంగి ప్రతాప్, సారయ్య, ఇసాక్, చంద్రయ్య, బ్రహ్మం, జ్ఞానదేవ్, ఉపేందర్, రామన్న, ఉప్పలయ్య, నారాయణరెడ్డి, మోహన్, షకీల్, శ్రీపాల్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, వెంకటాచారి, యాదగిరి తదితరులు ఉన్నారు. క్రీడా శిక్షణలో కృషి చేసిన వారిలో అమృతరెడ్డి, యాకుబ్‌అలీ తదితరులున్నారు.

● మానుకోటలో జాతీయస్థాయి క్రీడాకారులున్నప్పటికీ ప్రత్యేక క్రీడా ప్రాంగణం లేదు. దశాబ్దకాలం క్రితం ప్రాంగణం నిర్మితమైంది. ఈ ప్రాంగణంలోనే ప్రస్తుతం ఔత్సాహిక క్రీడాకారులు సాధన చేస్తున్నారు. దీనిని మరింత అభివృద్ధి పరచాల్సిన అవసరముంది.

50 ఏళ్ల క్రితమే రాష్ట్ర స్థాయి పోటీలు

బాస్కెట్‌బాల్ క్రీడ ఈ ప్రాంత విద్యార్థులను, యువతను బాగా ఆకట్టుకుంటున్న సమయంలోనే 1967లో తొలిసారిగా మహబూబాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. దాదాపు 10 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో రైల్వే, ఆర్టీసీ, హైదరాబాద్ ఎంసీహెచ్ తదితర జట్లు పాల్గొన్నాయి. అనంతర కాలంలో పలు రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ● 2013 మే నెలలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు ● 2014 డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ పురుష, మహిళ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల పోటీలకు కూడా మానుకోట వేదిక కావడం విశేషం.



మానుకోటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల దృశ్యాలు(పాతచిత్రం)

ఇలా అభివృద్ధి చేయాలి..

● మానుకోటలో బాస్కెట్‌బాల్ క్రీడను మరింతగా అభివృద్ధి పరచి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి పలు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముంది.

● ప్రస్తుతం ఉన్న బాస్కెట్‌బాల్ ప్రాంగణాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి.

● ఈ ప్రాంగణంలో రాత్రి వేళలోనూ ఆటలాడేందుకు ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు అవసరం.

● ప్రాంగణం చుట్టూ కంచె నిర్మించాలి

● కనీస సౌకర్యాల కల్పనతో క్రీడాకారుల వసతి గదులు అవసరం.

జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగాను..

– కల్లూరి తన్మయి, జిల్లా ఉత్తమ క్రీడాకారిణి అవార్డు గ్రహీత



సుమారు 7 సంవత్సరాలుగా బాస్కెట్‌బాల్ ప్రాంగణంలో ఇస్తున్న శిక్షణను పొంది ఇప్పటికి ఆరు జాతీయస్థాయి పోటీల్లో, 20 రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నాను. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ అభినందనీయం. శిక్షణ బాస్కెట్‌బాల్ క్రీడా నైపుణ్యాలను, ప్రతిభను పెంపొందించింది. కొన్ని నెలల క్రితం పుదుచ్చేరిలో జరిగిన సీనియర్ మహిళల జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. ఈ పోటీల్లో మన రాష్ట్రానికి రజత పతకం లభించింది.

క్రీడాకారులకు మెలకువలు నేర్పుతున్నాం

– వెలిశాల కుమారస్వామి, శిక్షకుడు, జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ



గత 20 సంవత్సరాలుగా ఇక్కడి బాస్కెట్‌బాల్ ప్రాంగణంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. బాస్కెట్‌బాల్‌కు సంబంధించి క్రీడా నైపుణ్యాలు, మెలకువలు నేర్పుతున్నాను. ఈ ఆటపై చిన్నపిల్లలు కూడా ఆసక్తిని చూపడం విశేషం. ఇప్పటికి కనీసం వందమంది క్రీడాకారులకు నైపుణ్యాలు నేర్పి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా అసోసియేషన్ ద్వారా శిక్షణ ఇచ్చాం.

పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం

–పిల్లి కాశీనాథ్, పీఈటీ, జడ్పీఎస్ఎస్, కంబాలపల్లి



నేను 8వ తరగతి నుంచే మానుకోటలో బాస్కెట్‌బాల్ ఆటపై ఆసక్తి చూపాను. ఆనాటి వ్యాయామ ఉపాధ్యాయులు సమ్మయ్యల, సీనియర్ క్రీడాకారుల ప్రోత్సాహం ఉంది. 1995 నుంచి వరుసగా నాలుగుసార్లు కాకతీయ విశ్వవిద్యాలయం తరపున కాలికట్, గాంధీగ్రాం, అన్నామలై, మద్రాస్ విశ్వవిద్యాలయాల్లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయల స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. పది రాష్ట్రాల్లో జరిగిన పోటీలకు వెళ్లాను. వ్యాయామ విద్యలో డిగ్రీ చేసి 2002 డీఎస్సీలో పీఈటీగా ఎంపికయ్యాను. నేను పనిచేస్తున్న కంబాలపల్లి గ్రామీణ ప్రాంత పాఠశాలలో నా తల్లిదండ్రుల పేరిట రూ.12 వేల వ్యయంతో బాస్కెట్‌బాల్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులు 4 జాతీయ, 15 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడకు మానుకోట పేరొందినా బాలికల జట్ల ప్రాతినిధ్యం మాత్రం తక్కువగా ఉంటుండటంతో బాలికలకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం. నా మిత్రులు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు కమల్‌కిషోర్, కృష్ణ, రవి తదితరులు కూడా పీఈటీలుగా ఉద్యోగం చేస్తున్నారు.

పాతికేళ్లుగా కొనసాగుతున్న శిక్షణ..

– ప్రతాప్‌రెడ్డి, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



1976 నుంచి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడిని. 18 సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మహబూబాబాద్ ప్రాంతంలో బాస్కెట్‌బాల్ క్రీడను నిరంతరం కొనసాగిస్తూ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మహబూబాబాద్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎంబీఏ)తో పాటు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యం ఇక్కడి బాస్కెట్‌బాల్ ప్రాంగణంలో శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ లాంటి పోటీలు ఇక్కడ నిర్వహించాం. కొందరికి ఉద్యోగాలు కూడా లభించాయి. పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ విభాగం పోటీల్లో తెలంగాణ మహిళల జట్టు ద్వితీయస్థానం పొందింది. కొత్త జిల్లాగా ఏర్పడిన మహబూబాబాద్‌లో బాస్కెట్‌బాల్‌తో పాటుగా ఇతర క్రీడలను అభివృద్ధి చేయాలి.

జలపాతం వద్ద పర్యాటకుల కోలాహలం

వాజేడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బొగత జలపాతం సోమవారం పర్యాటకుల కోలాహలంతో సందడిగా మారింది. వరుస సెలవులు రావడంతో జలపాతాన్ని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో జలపాతం వద్దకు చేరుకుంటున్నారు. ఉవ్వెత్తున దూకుతున్న వరదనీటి ప్రవాహంలో పర్యాటకులు తడిసి ముద్దవుతున్నారు. జలపాతంలో స్నానాలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. చిన్నారులు సైతం వరదనీటి పరవళ్లలో ఆటలాడుతున్నారు. వరద నీటిలో చిన్నారుల కేరింతలను కెమెరాలో చిత్రీకరించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం కనబరుస్తున్నారు. దట్టమైన అడవిలో కొండలపై నుంచి జలజలా రాలుతున్న వరదనీటి ప్రవాహం, జలపాతం అందాలను తిలకించి ముగ్ధులవుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రముఖ పర్యాటక కేంద్రం బొగత జలపాతంలో చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర సోమవారం పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం చేపట్టిన పనులను పరిశీలించిన ఆయన పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని అటవీ అధికారులకు సూచించారు. ఇటీవల జరిగిన ప్రమాదాలలో మృతిచెందిన సంఘటనల వివరాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు వరద నీటిలోకి వెళ్లకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించిన ఆయన కంచె, రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



ఆహ్లాదాన్ని పొందండి.. హానికర పనులు చేయకండి

బొగత జలపాతం అందాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందండి. ప్రాణాపాయం కలిగించే హానికరమైన పనులను చేయకండంటూ పర్యాటకులకు అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర సూచించారు. జలపాతం సందర్శనలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రకృతిలో ఏర్పడిన అందమైన జలపాతం పర్యాటకులకు కనువిందు చేసే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. పర్యాటకులు ప్రమాదాలకు గురి కాకుండా రెయిలింగ్ ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా పనులు చేపడతామని చెప్పారు. ఆయన వెంట డీఎఫ్‌వో రవికిరణ్, ఎపీడీవో వజ్రారెడ్డి, అటవీ క్షేత్రాధికారి శంకర్, ఎఫ్ఎస్వోలు నాగరాజు, లక్ష్మయ్య, ఎఫ్‌బీవో కేవల్‌రామ్ ఉన్నారు.



బొగత జలపాతంలో అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర



కృష్ణుడు మెరిశాడు

ముద్దుగారే యశోద ముంగిట ముత్యం వీడు.. అని సర్వాంతర్యామిని కీర్తించిన అన్నమయ్యను గుర్తుకుతెచ్చేలా వరంగల్ ఉమ్మడి జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులను శ్రీకృష్ణుడు.. గోపికలుగా అలంకరించి తల్లిదండ్రులు మురిసిపోయారు. వారి ఆటపాటలను చూసి ఆనందించారు. మిఠాయిలు, వెన్న తినిపించారు. చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు.. మా బిడ్డలకు రక్షణ కల్పించి బోగభాగ్యాలివ్వు.. అంటూ శ్రీకృష్ణున్ని భక్తితో వేడుకున్నారు. అనంతరం బాలకృష్ణులు ఉట్టి కొట్టేందుకు వీధుల్లోకి పరుగులు తీశారు.

న్యూస్‌టుడే, యంత్రాంగం



జయశంకర్ జిల్లా కాటారంలో..



మహబూబాబాద్‌లోని బస్టాండు సమీపంలో..



వరంగల్ అర్బన్ జిల్లా కాశీబుగ్గలోని కురుమవాడలో..



జయశంకర్ జిల్లా మంగపేట మండలం కమలాపురంలో..



వరంగల్ అర్బన్ జిల్లా మట్టెవాడలో ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న బాలకృష్ణులు



వరంగల్ అర్బన్ జిల్లా శివనగర్‌లో గోపికాకృష్ణుల సందడి



మహబూబాబాద్‌లోని కామధేను గోశాలలో..



వరంగల్ అర్బన్ జిల్లా మడికొండలో ఆకట్టుకున్న చిన్నారులు



జనగామలో సెల్ఫీ తీసుకుంటున్న గోపికల వేషధారణలో ఉన్న బాలికలు

ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి

నర్సింహులపేట, న్యూస్‌టుడే: నర్సింహులపేట శివారు పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో తోట మురళి(38) అనే వ్యక్తి మృతి చెందారు. ఎస్సై సీహెచ్ నగేష్ కథనం ప్రకారం మండలంలోని వంతడపల తండాకు చెందిన తోట మురళి నిత్యం నర్సింహులపేట నుంచి వంతడపల స్టేజీ ఆటో సర్వీస్ నడుపుతుంటారు.



మురళి మృతదేహం

ఆదివారం రాత్రి నర్సింహులపేట నుంచి వంతడపల స్టేజీకి వస్తున్న క్రమంలో స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో మూల మలుపు వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డుకు ఎడమవైపునకు బోల్తా పడడంతో మురళికి బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి సోదరుడు తోట కేశవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు నర్సింహులపేటలోని శ్రీ వెంకటేశ్వర ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

తేలని బాలికల అదృశ్యం కేసు!

నేరడ(కురవి), న్యూస్‌టుడే: ఇద్దరి బాలికల అదృశ్యమై ఇప్పటికి ఐదు రోజులు దాటుతున్నా వారి ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కురవి మండలం నేరడ శివారు భీమ్లాతండాకు చెందిన ఆ ఇద్దరు బాలికలు ఈ నెల 9న అర్ధరాత్రి కన్పించకుండా పోయిన విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మధ్యలో చదువు మానేసిన ఆ ఇద్దరు బాలికలు ప్రతి రోజు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం, కూలి పనులు చేస్తూ చేదోడు వాదోడుగా ఉంటున్నారు. గిరిజనుల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండగ వేళ అదృశ్యం కావడంతో వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆరు మాసాలుగా ఇద్దరు బాలికలు అత్యంత సన్నిహితంగా ఉంటున్నారని స్థానికులు చెబుతున్నారు. వెళ్లే ముందు దుస్తులు, సెల్ ఫోన్‌తో నగదు, ఆభరణాలు కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు కూడా చుట్టు పక్కల

అంతటా ఆందోళన

గ్రామాలు తట్టుపల్లి, నేరడ, మాధవాపురం శివారు తండాలకు చెందిన ఆటో డ్రైవర్లను ఆరా తీశారు. వివిధ పట్టణాలతో పాటు రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఆలయాలు వంటి ప్రాంతాల్లోనూ గాలిస్తున్నారు. రెండు కుటుంబాలకు చెందిన బంధువులు ఎక్కడ ఉంటున్నారనే సమాచారం తెలుసుకుని అక్కడా ఆరా తీస్తున్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త వెంకటేశ్ అదృశ్యమైన బాలికల పాత చిత్రాలతోపాటు తల్లిదండ్రుల పూర్తి వివరాలను పిల్లల మిస్సింగ్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రత్యేకంగా కరపత్రాలు ముద్రించారు. దీనిపై ఎస్సై అశోక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇద్దరి బాలికల ఆచూకీ కోసం హైదరాబాద్, విజయవాడలో గాలిస్తున్నట్లు చెప్పారు.

సోమేశ్వరాలయ ఈవో సస్పెన్షన్

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇటీవల పులిహోర ప్రసాదంలో బల్లి అవశేషం కనిపించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన దేవాదాయశాఖ అధికారులు ఆలయ ఈవో దేవులపల్లి సదానందను సోమవారం సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా గూడెంగుట్ట దేవస్థానం మేనేజరుగా పని చేస్తున్న పురుషోత్తమ చారిని పాలకుర్తి సోమేశ్వరాలయ ఈవోగా నియమించారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.



పైపై మెరుగులు.. తింటే ఆసుపత్రికి పరుగులు

ఆకర్షణీయ పాత్రల్లో నాసిరకమైన ఆహారం ● రైళ్లలో, రైల్వే స్టేషన్లలో మారని తీరు

న్యూస్‌టుడే, కాజీపేట

రైళ్లలో, రైల్వే స్టేషన్లలో ఆకర్షణీయ పాత్రలను చూస్తే.. ఆహారం మెరుగ్గానే కనిపిస్తుంది. వాటిని విప్పి తింటే మాత్రం ఆసుపత్రికి పరుగులు పెట్టాల్సిందే. కడుపు మాడ్చుకోవటం ఉత్తమమని చాలా మంది ప్రయాణికులు భావిస్తున్నారు. ఇప్పటికీ మెరుగైన, నాణ్యమైన ఆహారం అందక ఆకలితో అలమటిస్తూ ప్రయాణిస్తున్నారు. కనీసం రైల్వే ఆహారం కూడా తినలేక పోతున్నారంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమవుతుంది. కాజీపేట, వరంగల్, మహబూబాబాదు, జనగామ స్టేషన్లలో బయటి నుంచి వచ్చే ఆహారమే ఎక్కువగా ఉంటుంది. భారతీయ రైల్వే ఆహారం, పర్యాటక సంస్థ(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఆహారం విక్రయిస్తున్న ఆహారంలోనూ నాణ్యత లోపిస్తుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైళ్లలో ఆహారం తయారు చేస్తే నాసిరకంగా ఉంటుందని ఐఆర్‌సీటీసీ ఇటీవల కొన్ని రైల్వే స్టేషన్లను ఎంపిక చేసి గుత్తేదారుల ద్వారా తయారు చేయించి పలు రైళ్లకు పంపుతుంది. వీటి మీద పర్యవేక్షణ లేక పోవడంతో వారు అందించిన ఆహారం ప్రయాణికులు తినాల్సివస్తుంది.

సమోసాలు'

సమోసాల తయారీకి మార్కెట్లో దొరికే అతిచౌకైన పిండి, నూనెను వాడుతున్నారు. సమోసాల పిండిని కాళ్లతో తొక్కుతారు. పాడుబడిన బంగ్లాలో అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నారు. వీటిలో పెట్టే కూరకు పాడైనాక పడేసే ఆలుగడ్డలు, ఉల్లిపాయలు సేకరించి అందులో కాస్త బాగా ఉన్న భాగాన్ని కోసి కూరగా చేస్తున్నారు. హైదరాబాదు నుంచి పేరు ఊరులేని నాసిరకమైన నూనెలను తెచ్చి వాడుతున్నారు.

రాజధాని ప్రయాణికులకు బయటి ఆహారమే

యశ్వంతపూర్ నుంచి న్యూఢిల్లీ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు ఉదయం 10 గంటలకు కాజీపేట రైల్వే స్టేషన్‌లోనే మధ్యాహ్న భోజనం అందిస్తారు. ఐఆర్‌సీటీసీ గుత్తేదారు వీటిని సరఫరా చేస్తారు. ఇతను విష్ణుపురి ప్రధాన రహదారి మీద ఉన్న ఒక ఇంట్లో వీటిని తయారు చేస్తున్నారు. ఉదయం 7 గంటలకు తయారీ ప్రారంభం అవుతుంది. 9 గంటలకు పూర్తయ్యాక ప్యాకింగ్ చేస్తారు. వీటిని అక్కడ నుంచి నెట్టుడు బండిలో పెట్టుకుని తీసుకొచ్చి రాజధానికి అందిస్తారు. వీరు తయారు చేసే ఆహారాన్ని ఎవరూ తనిఖీ చేయరు... పైగా వీరు ఉదయం 10 గంటలకు అందించే ఆహారాన్ని మధ్యాహ్నం వేళ ప్రయాణికులకు అందిస్తారు. ఇలా చేయడం వల్ల చల్లగా మారి తినలేకపోతున్నామని ప్రయాణికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో ఇచ్చే చపాతీ, లేదా పాస్తా లాక్కుని తినాల్సి వస్తుందని, శనగపిండితో తయారు చేసే పప్పు కూడా చల్లారాక తినలేక పోతున్నామనే ఆరోపణలు ఆన్‌లైన్‌లో రైల్వేకు అందుతున్నాయి. ఇదే రైలు తిరుగు ప్రయాణంలో కూడా కాజీపేటలో సాయంత్రం 5 గంటలకు చపాతీలను అందిస్తారు. వీటిని కూడా రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్ దాటాక ప్రయాణికులకు అందిస్తున్నారు. వేడిగా ఉండగా ప్యాక్ చేయడం వలన కొన్నిసార్లు ఇవి వాసన వస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

అనధికార హాకర్ల బెడద

రైళ్లలో అనధికార హాకర్ల విక్రయాలు రైల్వేకు పెద్ద తలనొప్పిగా మారాయి. వీరు సమోసాలు, టీ, కాఫీలు , చల్లలు తెచ్చి విక్రయిస్తారు. సామోసాలు నాణ్యత లేకుండా తీసుకు వచ్చి అమ్ముతారు. అమ్ముడు పోనివాటిని కూడా తాజా సమోసాలతో కలిపి అమ్ముతారు. వీరి వద్ద ఆహారం తినడం వలన వారి అనారోగ్య పరిస్థితులు వచ్చే అవకాశం ఉంది. అందుకే అధికారికంగా ఆహారం అమ్మే వారికి ప్రతి ఆరు నెలలకోకసారి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులు, గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. ప్రతి హాకరు తప్పకుండా ఈ రెండు కార్డులను వెంట ఉంచుకోవాలి. కానీ చాలా మందికి ఇవి లేవు. కొందరు నకిలీవి తయారు చేసుకుని కూడా అమ్మకాలు సాగిస్తున్నారు. రైళ్లలో పాంట్రీకారు సిబ్బంది వద్ద ఫిర్యాదుల పుస్తకం ఉంటుంది అందులో రాయవచ్చు. ఐఆర్‌సీటీసీ రేల్ కనెక్ట్ పేరుతో ఆప్ ఉంటుంది. దీనిని చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసేటప్పుడు తమ టికెట్ పీఎన్ఆర్ నంబరు, పేరు, చిరునామా, చరవాణి నంబరు, తాము ప్రయాణం చేసే రైలు, సమయం, ప్రస్తుతం ఆ రైలు ఎక్కడ ఉంది. అనే వివరాలను పొందు పరిచి తమకు కలిగిన అసౌకర్యాన్ని నింపాలి.

అమ్మాల్సిన ధరలివీ..


శాఖాహార అల్పాహారం రూ. 50
మాంసాహార అల్పాహారం: రూ. 55
టీ 150 మి.లీ: రూ.5
285 మి.లీ రూ. 10
టీ సంచితో 150 మి.లీ: రూ. 7
కాఫీ: 150 మి.లీ: రూ.7,
285 మి.లీ రూ. 15

శాఖాహార భోజనం ధర: రూ. 50

వడ్డించాల్సినవి: 150 గ్రాముల అన్నం, 2 పరోటాలు లేదా 4 రొట్టెలు(100 గ్రాములు) ,150 గ్రాముల పప్పు, 100 గ్రాముల మిక్స్‌డ్ వెజిటేబుల్స్ కూర, తొక్కు, ప్యాకెట్, 100 గ్రాముల పెరుగు, లేదా ఏదైనా 40 గ్రాముల మిఠాయి, 250 మిల్లీ లీటర్ల శుద్ధి చేసిన నీరు.

మాంసాహార భోజనం ధర: రూ.55

150 గ్రాముల అన్నం, 2 పరోటాలు లేదా 4 రొట్టెలు(100 గ్రాములు) ,150 గ్రాముల పప్పు, రెండు కోడి గుడ్లతో వండిన కూర, తొక్కు, ప్యాకెట్, 100 గ్రాముల పెరుగు, లేదా ఏదైనా 40 గ్రాముల మిఠాయి, 250 మిల్లీ లీటర్ల శుద్ధి చేసిన నీరు.



కాజీపేటలో రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఆహారం ఎక్కిస్తున్న దృశ్యం

ఫిర్యాదు చేయండిలా

1800 111 139 నంబరుకు ఫోన్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

9711 111 139 కు సంక్షిప్త సమాచారం పంపొచ్చు

తప్పని అధిక ధరలు..

ఆహారం నాణ్యత లేక పోవడమే కాక నిబంధనలకు తగ్గట్టు విక్రయించటం లేదు. రూ. 50కు శాఖాహార భోజనం అందించాలనే నిబంధన ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసింది. ఇక మాంసాహార భోజనానికి రూ. 55 మాత్రమే తీసుకోవాలి. కానీ రైళ్లలో రూ. 70 నుంచి రూ. 120 వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.

పాంట్రీకారులో సిబ్బంది వండిందే వంట

కొన్ని రైళ్లలో ఆహారం తయారు చేసేందుకు ఉపయోగించే ప్రత్యేక బోగీని పాంట్రీకారుగా పిలుస్తారు. దీనిని గుత్తేదారులకే అప్పగిస్తారు. బోగీలో వండేది వీరు, విక్రయించేది వీరే .కాబట్టి ఎక్కడ కూడా నాణ్యత పాటించటం లేదు. పాంట్రీకారుల వలన రైళ్లలో ఎలుకలు, బొద్దింకల బెడద ఎక్కువ కావడంతో చాలా రైళ్లలో వాటిని ఎత్తి వేసి బయట నుంచి భోజనాలను తెప్పిస్తున్నారు. ప్రస్తుతం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మాత్రమే పాంట్రీకారులో భోజనాలను వడ్డిస్తున్నారు. మిగతా వాటిలో కేవలం టిఫిన్స్ విక్రయిస్తున్నా అవి రుచికరంగా ఉండటం లేదు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పరిశీలించినపుడు ఆలు బిర్యానీ 250 గ్రాములు ఉండాలి. కానీ వంద నుంచి 150 గ్రాములే ఉంది. పైగా రసాయన రంగులు కలిపి బిర్యానీలాగా చేస్తున్నారు.

ఇల్లు కూలి ముగ్గురికి గాయాలు

తాడ్వాయి,న్యూస్‌టుడే: వర్షానికి ఇల్లు కూలిపోవడంతో మండలంలోని మేడారంలో ముగ్గురు వృద్ధులు గాయాలపాలయ్యారు. బాధితుడి కథనం ప్రకారం... గండికోట వీరస్వామి అనే కూలి కుటుంబంతో కలిసి తన ఇంటిలో నిద్రపోయాడు. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు తన పెంకుటిల్లు కూలింది. ఇంటి వాసాలకింద వీరస్వామి, అతని కోడలు, మనమడు ఇరుక్కుపోయారు. వీరస్వామి, అతని కోడలు వేసిన కేకలు రాత్రివేళ కావడంతో ఇరుగుపొరుగు వారు ఎవరూ గమనించలేదు. పూర్తిగా తెల్లవారిన తరువాత గ్రామస్థులు గమనించి వాసాలకింద పడిఉన్న వీరస్వామి, అతని కుటుంబసభ్యులను బయటికి తీశారు. తీవ్ర గాయాలపాలయిన వీరస్వామిని, స్వల్ప గాయాలపాలయిన అతని కోడలు, మనవడిని ఆసుపత్రికి తరలించారు.

18.4 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం

ఖానాపురం, న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాకాలలోకి నీరు చేరడంతో 18.4 అడుగులకు నీటిమట్టం చేరింది. ఆదివారం 17.5 అడుగుల నీరుండగా సోమవారం సాయంత్రానికి 18.4 అడుగులకు నీరు చేరింది. కొంత వరద నీరు వస్తోందని స్వల్పంగా నీటి మట్టం పెరుగనుందని ఐబీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ స్వామి తెలిపారు.



'పీడిస్తున్న సమస్యల నుంచి దేశానికి విముక్తి కల్పించి 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దడానికి ప్రజలు ప్రతిజ్ఞ తీసుకోవాలి. పూజ్య బాపూజీ సహా ఆయన నాయకత్వాన ఉద్యమాలు నడిపి అమరులైన వారి పోరాటాల నుంచి స్ఫూర్తి పొందాలి. నాటి ఉద్యమ గొప్పదనాన్ని భవిష్యత్తు తరాలకు తెలియ పరచాల్సిన గురుతర బాధ్యత నేటితరంపై ఉంది'.

–నరేంద్ర మోదీ


ఉమ్మడి జిల్లా సమగ్ర స్వరూపం

జిల్లా	జనాభా	గ్రామ పంచాయతీలు	మండలాలు
వరంగల్ రూరల్	716457	269	15
వరంగల్ అర్బన్	1135707	107	11
మహబూబాబాద్	770170	287	16
జనగామ	582457	210	13
జయశంకర్ భూపాలపల్లి	711280	274	20

స్వాతంత్ర్య సాధనే స్ఫూర్తి

● ఇదాం నవభారతానికి శక్తి

● మన నుంచే మొదలవ్వాలి మార్పు



దేశ వ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా సాధిస్తాం లేదా ప్రాణాలర్పిస్తాం అనే నినాదం ప్రతిధ్వనించింది. ఈచారిత్రక ఉద్యమాన్ని స్మరించుకోవడం జాతికి ఎంతో బలాన్ని సమకూరుస్తుంది. స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలన్న లక్ష్యంతో నాడు అంతా ఒక తాటి మీదకొచ్చారు. 1942లో దేశానికి వలసవాదుల నుంచి విముక్తి కల్పించడానికి ప్రజలంతా పోరాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పుడు మన ముందున్న సమస్యలు వేరు. పేదరికం, అపారిశుధ్యం, అవినీతి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పోషకాహార లేమి వంటి వర్తమాన సమస్యల నుంచి దేశాన్ని బయటకు తీసుకురావడం తక్షణ అవసరం. వీటిని పారదోలేందుకు నాటి పోరాట వీరుల స్ఫూర్తితో 'మేం సాధిస్తాం.. తప్పకుండా చేస్తాం' అంటూ ప్రతిజ్ఞ బూనుదాం. తద్వారా సరికొత్త భారతావనిని సృష్టించుకుని 2022 నాటికి మన కలల్ని సాకారం చేసుకుందాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుత పరిస్థితులు, వాటిని అధిగమించడానికి మనం ఏం చేయాలనేది ప్రతి పౌరుడు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సమయం ఇది. మనం మారితేనే మార్పు సాధ్యమవుతుందనే కోణం నుంచి ఆలోచన చేస్తే అందరి కలలు సాకారమవుతాయి. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం

మన చుట్టూ ఉన్న సమస్యలను ఆకళింపు చేసుకుని వాటి పరిష్కారానికి మనవంతు బాధ్యత నిర్వర్తిస్తే సరిపోతుంది. దేశ ప్రగతికి విద్య, వైద్యం, పారిశుధ్యం, మౌలిక వసతులు ఎంతగానో తోడ్పాటునందిస్తాయి. దీన్ని దృష్టి పెట్టుకుని పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, జల సంరక్షణ, వ్యవసాయం రంగాలను నిర్లక్ష్యం చేయకుండా ఉంటే చాలు. చిత్తశుద్ధి, బాధ్యత మన నుంచే మొదలు కావాలనే సంకల్పంతో ముందడుగు వేస్తే మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను నవ భారతం దిశగా నడిపించడం పెద్ద కష్టమేమీ కాదు. తదనుగుణంగా ఈ పవిత్ర దినాన ప్రతిజ్ఞ బూనుదాం

న్యూస్‌టుడే, డోర్నకల్

అందరికీ విద్య సాధిద్దాం



ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలనేది ప్రభుత్వ తపన. ఈ ఆశయ సాధనకు పల్లె పల్లెన బడులు ఏర్పాటు చేసింది. వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసం సాక్షర భారత్ నెలకొల్పింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లలకు ఉచిత సదుపాయాలు కలిపిస్తోంది. అయితేనేం పేదరికం, అవగాహనలేమితో అనేక మంది పిల్లలు బడి బయట ఉంటున్నారు. నిరక్షరాస్యులు సాక్షర భారత్ కేంద్రాలకు రావటం లేదు. వీరిని చదివించే బాధ్యత ఒక్క ప్రభుత్వ అధికారులదో, ఉపాధ్యాయులదో, ప్రజాప్రతినిధులతో అనుకోవడం సరికాదు. పౌరులుగా మనపైనా ఈ 'గురు'తర బాధ్యత ఉందనేది మరవొద్దు. సర్కారు బడుల్లో వసతుల్లేవని మిన్నకుండిపోతే మన కర్తవ్యాన్ని విస్మరించినట్లే. దాతలు, విదేశాలల్లో స్థిరపడ్డ గ్రామస్థులు, పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లి సర్కారు బడులను బలపేతం చేద్దాం.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు: 2252

ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు 561

ఉన్నత పాఠశాలలు 833

అనుబంధ కళాశాలలు 136

సాక్షర భారత్ కేంద్రాలు 1087

నిరక్షరాస్యులు: 4.20 లక్షలు

సర్కారు వైద్యం పట్ల నమ్మకం పెంచుదాం



ప్రైవేటుతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రులకు క్రమేపీ ఆదరణ పెరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సేవలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యవంత సమాజం ఆవిర్భావానికి ప్రభుత్వం ఇతోధికంగా నిధులు కేటాయిస్తోంది. వీటి వినియోగం విషయంలోనే పారదర్శకత కొరవడింది. పౌరులుగా దీనిపై మనం దృష్టి పెట్టాలి. వ్యాధుల నివారణ, నిర్ధరణలో వైద్య సిబ్బందికి తోడ్పాటు అందించాలి. ఇది తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరించటం తగదు. ప్రధానంగా యువత మేల్కోవాలి. ఆరోగ్యవంత సమాజం ఏర్పాటుకే కాదు సర్కారు వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకం పెరగడానికి మార్గం సుగమనమవుతుంది.

ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రాలు 697 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 73 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీ)లు 08

పచ్చదనం పెంచుదాం



తట్టుకోలేని ఎండలకు ప్రధాన కారణం పచ్చదనం లోపించటమే. మూడేళ్ల నుంచి ఉష్ణోగ్రత ప్రతాపం ప్రదర్శిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం 23.20 శాతం కాగా విభజన తర్వాత తెలంగాణలో ఇది 24 శాతం ఉంది. పర్యావరణ సమతుల్యతకు 33 శాతం అడవులు ఉండాలి. మూడో విడత హరితహారంలో పల్లెపల్లెకు ఇచ్చిన లక్ష్యం 40 వేల మొక్కలు. రాష్ట్ర సగటును పరిగణలోకి తీసుకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమతుల్యత సాధనకు అవసరమైన మొక్కలు నాటడానికి ఎంత లేదన్నా పదిహేనేళ్లు పట్టడం ఖాయం. ఇందులో మనమందరం తలో చెయ్యి వేసినప్పుడు లక్ష్య సాధన సులభతరమవుతుంది. మొక్కను నాటిందెవరైనా దానిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందనేది గుర్తుంచుకోవాలి.

భౌగోళిక విస్తీర్ణం: 11848.31 చదరపు కిలోమీటర్లు

అటవీ విస్తీర్ణం: 4581.03 చదరపు కిలోమీటర్లు

సమతుల్యత సాధనకు నాటాల్సిన మొక్కలు: 28.25 కోట్లు

పరిశ్రమల స్థాపనకు చేయూత



యువతకు ఉపాధి ఆశించిన మేర లభ్యం కావడం లేదు. టీపాస్ కింద ప్రతిపాదించిన పరిశ్రమలు త్వరితగతిన అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి మెరుగు పడుతుంది. జిల్లాలో చదువుకున్న విద్యావంతులకు కొదవేం లేదు. వీరు ఉద్యోగాన్వేషణ మాని పరిశ్రమలు నెలకొల్పే దిశగా అడుగులు వేయాలి. ఇందుకు ప్రభుత్వం అనేక రకాలుగా రాయితీలిస్తోంది. హైదరాబాద్ తర్వాత ఐటీ కంపెనీల దృష్టి వరంగల్ మీదే కేంద్రీకృతమైంది. ఇక్కడ ఆధునిక అభివృద్ధికి అవసరమైన వనరులు, రవాణ సదుపాయం ఉందనేది మరవొద్దు. వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ- సంగెం మండలాల మధ్య వస్త్రపరిశ్రమ నిర్మాణానికి రంగం సిద్ధం కావడం ఓ శుభపరిణామమే. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కల సాకారమైతే గిరిజనులకు ఉపాధి చేరువవుతుంది.

పరిశ్రమల సంఖ్య: 1941

వీటిల్లో పని చేస్తున్న ఉద్యోగులు: 25468

పెట్టుబడి: రూ.35901 కోట్లు

మేడారం భక్తుల సేవకు ఆర్టీసీ సన్నద్ధం: ఆర్ఎం



బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్ సూర్యకిరణ్

తాడ్వాయి, న్యూస్‌టుడే: మేడారం సమ్మక్క, సారలమ్మ దేవతల దర్శనాలకు వచ్చే భక్తులకు సేవలందించేందుకు ఆర్టీసీ పూర్తిస్థాయిలో ఇప్పటినుంచే సన్నద్ధమవుతుందని సంస్థ రీజినల్ మేనేజర్ సూర్యకిరణ్ అన్నారు. డివిజన్ మేనేజర్లు కళ్యాణి, రాములు, డీఈ సుబ్రమణ్యేశ్వర్, వివిధ జిల్లాలోని 9 డిపోల మేనేజర్లతో కలసి సోమవారం ఆయన మేడారంలో పర్యటించారు. జాతరకు వచ్చే భక్తులు దిగే ప్రదేశం, భక్తులు తిరుగుముఖం పట్టే సందర్భంలో బస్సులు ఎక్కే ప్రదేశం, టిక్కెట్లు తీసుకునే క్యూలైన్ల ప్రదేశాన్ని, దేవతల గద్దెలు, ప్రభుత్వ అతిథిగృహాలు పరిశీలించారు. వన దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్ఎం విలేకరులతో మాట్లాడారు. జాతరకు ఐదు నెలల వ్యవధి మాత్రమే ఉన్నందున క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు తమ బృందం మేడారం వచ్చిందన్నారు. క్రితం సారి 3600 బస్సులు నడిచాయని, ఈసారి భక్తుల అవసరాల మేరకు మరిన్ని పెంచుతామన్నారు. జాతరలో 11వేలమంది ఆర్టీసీ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారని, వీరంతా విశ్రాంతి తీసుకునేందుకు షెడ్లు నిర్మించనున్నామన్నారు. ఇందుకు కలెక్టర్ స్వయంగా రూ.కోటి నిధులు మంజూరు చేస్తాననీ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నిధులతో షెడ్లతోపాటు శాశ్వత బస్టాండు నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. భక్తుల సంఖ్యకణుగుణంగా ఎక్కువ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏసీ బస్సులు నడిపిస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు ప్రతిపాదనలు తయారుచేసి కలెక్టర్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం



పాదయాత్రను ప్రారంభిస్తున్న జీఎస్సార్

గణపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దామని ములుగు మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతక్క అన్నారు. సోమవారం తెదేపా జిల్లా అధ్యక్షుడు గండ్ర సత్యనారాయణరావు మండలంలోని ధర్మారావుపేట శివారు వెంకటేశ్వర్లపల్లి నుంచి గణపురం దాకా 13 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. మోరంచ వాగు రెండో పాయ వద్ద మరో హైలెవల్ వంతెన నిర్మించాలని, రామప్ప, గణపురం చెరువులను రిజర్వాయర్లుగా మార్చాలనే నినాదంతో ఆయన చేపట్టిన పాదయాత్రకు స్పందన వచ్చింది. వెంకటేశ్వర్లపల్లిలో ఆయన పాదయాత్ర ప్రారంభించే ముందు ప్రసంగించారు. మంజూరు నగర్ ఏరియాలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ కలెక్టర్ కార్యాలయం ఇంకా ఇతర కార్యాలయాల కోసం ప్రైవేటు భూములను కొనుగోలు చేయాల్సిన అవసరమేమి ఉందని ప్రశ్నించారు.

సత్తెన్న పాదయాత్రలో నిజాయితీ ఉంది: సీతక్క

గండ్ర సత్యనారాయణరావు పాదయాత్రలో నిజాయితీ ఉందని ఆయన ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ పాదయాత్రకు ప్రజలు ప్రతి గ్రామంలో మంగళహారతులు పట్టుకొని మహిళలు స్వాగతం పలికారు. మధ్యాహ్ని భోజనాన్ని ఆయన మోరంచ వాగువద్దే కానిచ్చారు. సమావేశంలో చోటేమియా, సదానందం, రమేష్, సర్పంచి శ్రీలత, పరుశురాం, ఎం. రాజయ్య తదితరులున్నారు.

ఆగస్టు 8: రాష్ట్రీయం

తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు అనుమతి

♦ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అంతర్రాష్ట్ర బదిలీలకు అనుమతినిస్తూ, దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశాయి. భార్యాభర్తల బదిలీలు, స్థానిక (జిల్లా, జోనల్, బహుళ జోనల్), కేంద్రం ఆమోదం పొందిన రాష్ట్ర స్థాయి కేటగిరీల్లో పరస్పర బదిలీలకు అనుమతి లభించింది. ప్రభుత్వ శాఖలతో పాటు స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా ఇవి వర్తిస్తాయి. తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా కమలనాథన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల విభజన జరిగింది. 58, 42 శాతం దామాషాలో కేటాయింపులు జరిపారు. వివిధ కారణాలతో చాలామంది ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీలను కోరారు. దీనిపై గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఇద్దరు సీఎంలు అంతర్రాష్ట్ర బదిలీలకు ఆమోదం తెలిపారు.

ప్రతిభ

'సంకల్పం నుంచి సిద్ధి వరకు' నినాదం ఎవరిది?

కరెంట్ అఫైర్స్

జాతీయం

ఆగస్టు 4

నావిక్‌కు భారత పరమాణు గడియారాలు

♦ సొంత జీపీఎస్ వ్యవస్థ (నావిక్)లో స్వదేశీకరణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. నావిక్‌కు భారత పరమాణు గడియారాల ద్వారానే సమయాన్ని అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఇస్ట్రాక్‌సెల్, దిల్లీలోని నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇస్రోకు అత్యంత కచ్చితమైన సమయాన్ని ఎన్‌పీఎల్ అందిస్తుంది. ఇది అందించే భారత ప్రామాణిక సమయానికి (ఐఎస్‌టీ) అనుగుణంగా 'నావిక్' సమన్వయమవుతుంది.

ఆగస్టు 7

అగర్తలాలో ఎల్పీజీ బాట్లింగ్ కర్మాగారం



♦ రూ.143 కోట్లతో అగర్తలాలో నిర్మించనున్న ఎల్పీజీ బాట్లింగ్ కర్మాగారానికి కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ఎదురవుతున్న వంట గ్యాస్ కొరతను అధిగమించడానికి చిట్టగాంగ్ నుంచి త్రిపుర వరకు సహజ వాయువు గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. పశ్చిమ బంగలోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్‌లోని పార్వతీపూర్ వరకు డీజిల్ చేరవేయడానికి గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. గృహావసరాల కోసం పేదలు వినియోగించే కిరోసిన్, వంటగ్యాస్ సిలిండర్లపై రాయితీ కొనసాగుతుందని ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు.

ఆగస్టు 8

అయోధ్యకు పరిష్కారం

♦ అయోధ్యలో వివాదాస్పద స్థలానికి సముచిత దూరంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో మసీదును నిరభ్యంతరంగా నిర్మించుకోవచ్చంటూ ఉత్తర్ ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు సుప్రీంకోర్టుకు తన అభిప్రాయాన్ని సూచనప్రాయంగా తెలిపింది. ఈ వ్యవహారంలో వివిధ హిందూ సంస్థలు చేస్తోన్న డిమాండ్‌కు మద్దతుగా ముందుకొచ్చిన తొలి ముస్లిం సంస్థ యూపీ షియా బోర్డే అవుతుంది. అయితే అదే సమయంలో బాబ్రీ మసీదు స్థలం తమ సొంత ఆస్తి అని, ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారానికి చర్చలు జరిపే హక్కు తమకు మాత్రమే ఉందని కూడా వక్ఫ్‌బోర్డు స్పష్టం చేసింది.

ఆగస్టు 9

క్విట్ ఇండియా ఉద్యమ 75వ వార్షికోత్సవం

♦ క్విట్ ఇండియా దినోత్సవ 75 వ వార్షికోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'సంకల్పం నుంచి సిద్ధి వరకు' అనే నినాదాన్ని ఇచ్చారు. పీడిస్తోన్న సమస్యల నుంచి దేశానికి విముక్తి కల్పించి, 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దడానికి ప్రజలు ప్రతిజ్ఞ తీసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రూపొందించిన ఎనిమిది తపాలా బిళ్లలను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో విడుదల చేశారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

♦ గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. భాజపా నుంచి బరిలో దిగిన జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సునాయాసంగా గెలుపొందగా, మూడో అభ్యర్థి బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ మాత్రం ఓటమి పాలయ్యారు. సోనియా గాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ వెంట్రుకవాసిలో ఓటమిని తప్పించుకుని విజయం సాధించారు. గెలవడానికి అవసరమైన 44 ఓట్లను దక్కించుకున్న పటేల్ అయిదోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

ఆగస్టు 10

హమీద్ అన్సారీ పదవీ విరమణ

♦ రెండు విడతల్లో పదేళ్లపాటు రాజ్యసభ ఛైర్మన్, ఉప రాష్ట్రపతి హోదాల్లో సేవలందించిన మహ్మద్ హమీద్ అన్సారీ పదవీ కాలం పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఆయనకు రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికింది.

పెరగనున్న కేంద్ర ప్రభుత్వ వ్యయం

♦ కేంద్ర ప్రభుత్వ వ్యయం 2019-20 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.26 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని పార్లమెంటుకు సమర్పించిన ఆర్థికశాఖ అధికార పత్రం వెల్లడించింది. మూలధన వ్యయం 25% పెరిగి, ఆ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3.9 లక్షల కోట్లకు చేరుతుందని, ఒక్క రక్షణ రంగ వ్యయమే 22% పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. రెవెన్యూ వ్యయంతో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు రూ.21.46 లక్షల కోట్లుగా, వచ్చే ఏడాది రూ. 23.4 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది.

ఆగస్టు 11

వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం

♦ దేశ 15 వ ఉపరాష్ట్రపతిగా (వ్యక్తుల పరంగా 13) తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకయ్య భగవంతుడి పేరిట ప్రమాణం చేశారు.

♦ ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకయ్య నాయుడు రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

అంతర్జాతీయం

ఆగస్టు 6

ఉత్తర కొరియాపై ఆంక్షలు

♦ ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలను విధిస్తూ అమెరికా రూపొందించిన ఒక తీర్మానానికి ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనివల్ల ఉత్తర కొరియాకు ఏటా 100 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్నిచ్చే ఎగుమతులపై నిషేధం అమలవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా చేపట్టిన మొదటి చర్య ఇదే. దీనికి ఉత్తర కొరియా మిత్రపక్షం చైనా కూడా మద్దతు తెలపడం విశేషం.

ఆగస్టు 7

♦ వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా కృత్రిమ దీవులను ఏర్పాటు చేయడం, వాటిపై నిర్మాణాలు చేపట్టడం, సైనికీకరణను అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ఖండించాయి. మనీలాలో జరిగిన ఆసియాన్ విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా కొన్ని ఆసియాన్ దేశాలు దక్షిణ చైనా సముద్ర వివాదం విషయంలో చర్చలపై చైనా విధి విధానాలకు అంగీకారం తెలిపాయి. ఇలా చైనా పట్ల ఆసియాన్ వైఖరి మెత్తబడిన తరుణంలో ఈ మూడు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ఆగస్టు 9

వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించిన ఖతార్

♦ భారత్‌తో సహా 80 దేశాల ప్రజలకు వీసా రహిత ప్రవేశానికి అనుమతి ఇస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. ఈ 80 దేశాల ప్రజలు ఖతార్ చేరుకున్న వెంటనే అక్కడికక్కడే పర్యటక వీసాలను మంజూరు చేస్తారు.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 5

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్ కుమార్



♦ నీతి ఆయోగ్ తదుపరి వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ రాజీవ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఆర్థిక శాస్త్రంలో డీఫిల్, లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన రాజీవ్ కేంద్ర విధానాల పరిశోధన సంస్థలో సీనియర్ ఫెలోగా ఉన్నారు. గతంలో ఫిక్కీకి సెక్రటరీ జనరల్‌గా, భారతీయ అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధన మండలికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.

ఆగస్టు 8

ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా



♦ సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ ఈనెల 27 న పదవీ విరమణ చేస్తోన్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. దీపక్ 1977 లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1996 లో ఒడిశా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1997 లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2009 లో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2010 లో దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2011 లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 8

వయోపరిమితికి మరో రెండేళ్లు..

♦ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర నియామక సంస్థల ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితి పెంపుదలను మరో రెండేళ్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ నియామకాలకు మాత్రమే పెంపుదల వర్తిస్తుందని, పోలీసు, అబ్కారీ, అటవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లాంటి యూనిఫాం సర్వీసులకు వర్తించదని పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిరుద్యోగుల వినతి మేరకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 34 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ 2017 జులై 27 న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ గడువు 2017 జులై 26 తో ముగిసిపోయింది. తాజాగా దీన్ని మరో రెండేళ్లపాటు అంటే 2019 జులై 26 వరకూ అమలు చేసేందుకు ఆదేశాలిచ్చింది.

ఆగస్టు 10

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన

♦ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి సంబంధించిన వరద కాలువ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం పోచంపాడు వద్ద గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మేడిగడ్డ నుంచి తరలించే జలాలతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. ప్రధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి చుక్కనీరు రాకపోయినా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళతో ఉట్టిపడేలా రూ.2 వేల కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

♦ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీకి (ఐఐపీఈ) జాతీయ ప్రాధాన్యత హోదా కల్పిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్‌లో పేర్కొన్న హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం గతేడాది విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఐఐపీఈని ప్రారంభించింది. మిగతా జాతీయ విద్యా సంస్థల్లాగే డిగ్రీలు ప్రదానం చేసే స్వయం ప్రతిపత్తి కల్పించడానికి ఈ బిల్లును ఉద్దేశించారు.

ఆగస్టు 6

చిత్తూరు జిల్లాలో ఈ - క్లస్టర్

♦ చిత్తూరు జిల్లాలో 501 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ క్లస్టర్ (ఈ-క్లస్టర్)కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తుది అనుమతులు జారీచేసింది.

ఆగస్టు 8

విజయవాడలో విద్యుత్‌సౌధ ప్రారంభం

♦ విజయవాడలోని గుణదలలో నిర్మించిన విద్యుత్ సౌధ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ)ను సీఎం చంద్రబాబుతో కలిసి గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. సంతోషానికి చిహ్నంగా ఈ భవనాలకు 'సమృద్ధి' అనే పేరు పెట్టాలని గవర్నర్ సూచించారు.

ఆగస్టు 9

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

♦ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అరకులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, గవర్నర్ నరసింహన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో 34 తెగల్లో 27.39 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.3,520 కోట్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు.



రచయిత

- సిహెచ్. కృష్ణప్రసాద్

విషయ నిపుణులు

IBPS - RRBs Recruitment

ప్రతిభ

No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

Directions (Q.31 - 35): Below is given a passage followed by several possible inferences which can be drawn from the facts stated in the passage. You have to examine each inference separately in the context of the passage and decide upon its degree of truth or falsity. Mark answer

1) If the inference is "definitely true" i.e. it properly follows from the statement of facts given.
2) If the inference is "probably true" though not "definitely true" in the light of the facts given.
3) If the data are inadequate i.e. from the facts given you cannot say whether the inference is likely to be true or false.
4) If the inference is "probably false" though not "definitely false" in the light of the facts given.
5) If the inference is "definitely false" i.e. it cannot possibly be drawn from the facts

Note: Each of the five questions has only one distinct answer i.e. no two questions can have the same answer. If you get same answer for more than one question, consider both again and decide which one of the two would more definitely be that answer and same way review other also.

The first time I saw The Wizard of Oz, the story bewitched me the second time I saw The Wizard of Oz, the special effects amazed me. The third time I saw The Wizard of Oz, the photography dazzled me. Have you ever seen a movie twice, three times? You notice subtleties and hear sounds you completely missed the first time around. It's the same on the phone. Be-cause your business conversations are more consequential than movies, you should listen to them two, may be three times. Often we have no clear idea of what really happened in our phone conversation until we hear it again. You'll find shadings more significant than the colour of Toto's collar - and more scarecrows than you imagined who 'haven't got a brain!' How do you listen to your important business conversations again? Simply legally and ethically tape record them. I call the technique of recording and analyzing your business conversations for subtleties Instant Replay.

31. The movie The Wizard of Oz' will help improve business conversation.

32. For most, if they watch a movie more than once, different aspects in different order, like special effects, photography, story, music etc. would impress in a better way.

33. The tips are given for understanding business conversation.

34. The advice is being given to the sales team.

35. The author watches most movies more than twice.

Directions (Q.36 - 40): In each of the questions/ set of questions below are given two statements followed by two conclusions numbered I and II. You have to assume everything in the statements to be true even if they seem to be at variance from commonly known facts and then decide which of the two given conclusions logically follows from the information given in the statement. Give answer

1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or conclusion II follows.
4) If neither conclusion I nor conclusion II follows.
5) If both conclusions I and II follow.

36. Statements: Some pins are clips.
Some clips are pens.
Conclusions: I. Some pins are pens.
II. No pin is a pen.

(Q.37-39):
Statements: All D's are A's.
All A's are C's.

37. Conclusions: I. Some C's are D's.
II. Some A's are D's.

38. Conclusions: I. All D's are C's.
II. Some D's are not A's.

39. Conclusions: I. All A's are D's.
II. All C's are A's.

40. Statements: All doors are windows.
Some windows are clips.
Conclusions: I. Some clips are doors.
II. Some windows are doors.

Mail your feedback to..
pratibhadesk@eenadu.net

Quantitative Aptitude

41. 8 men can complete a piece of work in 20 days. 8 women can complete the same work in 32 days. In how many days will 5 men and 8 women together complete the same work?
1) 16 days 2) 12 days 3) 14 days
4) 10 days 5) None of these

42. The area of a square is 1024 sq. cm. What is the respective ratio between the length and the breadth of a rectangle whose length is twice the side of the square and breadth is 12 cm. less than the side of the square?
1) 5 : 18 2) 16 : 7 3) 14 : 5
4) 32 : 5 5) None of these


43. The sum of five consecutive even numbers of set-A is 220. What is the sum of a different set of five consecutive numbers whose second lowest number is 37 less than **double** of the lowest number of set -A?
1) 223 2) 225 3) 235
4) 243 5) None of these

44. The bus fare for one person is Rs. 420 from Agra to Aligarh and train fare between the same places for one person is equal to threefourth the bus fare for two persons between the same places. What is the total fare paid by 2 persons travelling by bus and 4 persons travelling by train between the two places?
1) Rs. 3,360 2) Rs. 3,460 3) Rs. 3,440
4) Rs. 3,406 5) None of these

45. The respective ratio between the speeds of a car, a jeep and tractor is 3 : 5 : 2. The speed of the jeep is 250 percent of the speed of the tractor which covers 360 km in 12 hours. What is the average speed of car and jeep together?
1) 60 km/hr. 2) 75 km/hr. 3) 40 km/hr.
4) Cannot be determined
5) None of these

Directions (Q.46 - 50): Study the following bar-graph carefully and answer the following questions.

Earnings (in rupees) of three different persons on four different days



46. What is Gita's average earnings over all the days together?
1) Rs.285 2) Rs.290 3) Rs.320
4) Rs.310 5) Rs.315

47. What is the total amount earned by Rahul and Naveen together on Tuesday and Thursday together?
1) Rs.1,040 2) Rs.1,020 3) Rs.980
4) Rs.940 5) Rs.860

48. Gita donated her earnings of Wednesday to Naveen. What was Naveen's total earnings on Wednesday after Gita's donation?
1) Rs.520 2) Rs.550 3) Rs.540
4) Rs.560 5) Rs.620

49. What is the difference between Rahul's earnings on Monday and Gita's earnings on Tuesday?
1) Rs.40 2) Rs.20 3) Rs.50
4) Rs.30 5) Rs.10

50. What is the respective ratio between Naveen's earnings on Monday, Wednesday and Thursday?
1) 7 : 3 : 5 2) 8 : 6 : 5 3) 8 : 7 : 4
4) 9 : 5 : 4 5) 9 : 3 : 4

Directions (Q.51 - 55): Study the following table carefully to answer the questions that follow:

Monthly Rent (in Rs. thousands) at five different places in six different years

	Place				
Years	Churchgate	Dadar	Kandivali	Borivali	Virar
2005	5.3	3.8	1.5	2.7	1.1
2006	12.5	8.3	3.4	4.8	2.1
2007	16.7	11.7	5.5	6.6	1.8
2008	20.9	13.6	9.8	12.7	3.6
2009	25.8	14.5	11.5	14.1	5.5
2010	30.3	20.9	15.6	15.9	7.8

51. In which place the monthly rent did not increase consistently from year 2005 to 2010?
1) Churchgate 2) Dadar 3) Kandivali
4) Borivali 5) Virar

52. In which year at Churchgate, the monthly rent increased more than 100 percent from the previous year?
1) 2006 2) 2007 3) 2008
4) 2009 5) 2010

53. What was the difference between the monthly rent at Dadar in the year 2009 and Borivali in the year 2007?
1) Rs.7,600 2) Rs.7,900 3) Rs.8,100
4) Rs.8,600 5) None of these



54. Monthly rent at Kandivali in the year 2008 was approximately what percent of the total monthly rent at Virar over all the years together?
1) 30 2) 33 3) 38 4) 42 5) 45

55. Which city was most expensive in terms of rent?
1) Churchgate 2) Dadar 3) Kandivali
4) Borivali 5) Virar

Directions (Q.56 - 60): In the following questions two equations numbered I and II are given. You have to solve both the equations and - Give answer

1) If $x > y$ 2) If $x \geq y$
3) If $x < y$ 4) If $x \leq y$
5) If $x = y$ or the relationship cannot be established

56. I. $5x^2 - 18x + 9 = 0$
II. $20y^2 - 13y + 2 = 0$.

57. I. $x^3 - 878 = 453$
II. $y^2 - 82 = 39$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$ II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$

59. I. $9x - 15.45 = 54.55 + 4x$
II. $\sqrt{y + 155} - \sqrt{36} = \sqrt{49}$

60. I. $x^2 + 11x + 30 = 0$ II. $y^2 + 7y + 12 = 0$

Directions (Q.61 - 65): What will come in place of the question mark (?) in the following number series?

61. 7 20 46 98 202 (?)
1) 420 2) 410 3) 310
4) 320 5) None of these

62. 210 209 213 186 202 (?)
1) 138 2) 77 3) 177
4) 327 5) None of these

63. 27 38 71 126 203 (?)
1) 212 2) 202 3) 301
4) 312 5) None of these

64. 435 354 282 219 165 (?)
1) 103 2) 112 3) 120
4) 130 5) None of these

65. 4 200 369 513 634 (?)
1) 788 2) 715 3) 734
4) 755 5) None of these

Key

31-5	38-1	45-1	52-1	59-5
32-4	39-4	46-2	53-2	60-3
33-1	40-2	47-4	54-5	61-2
34-2	41-1	48-3	55-1	62-2
35-3	42-5	49-1	56-1	63-5
36-3	43-5	50-5	57-2	64-3
37-5	44-1	51-5	58-5	65-3.

(మిగతా ప్రశ్నలు రేపటి పేజీల్లో)

దేశభక్తి ఉప్పొంగే ప్రదేశాలివి!




పంద్రాగస్టు అనగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజని ఎవర్ని అడిగినా చెబుతారు. దాన్ని సాధించడానికి జరిగిన ఉద్యమాలు... పోరాటం సాగించిన నేతలు గుర్తొస్తారు. మరి ఆనాటి పోరాటాలు జరిగిన ప్రదేశాలు మీకు తెలుసా? ఆ ప్రదేశాలను తల్చుకుంటే చాలు అప్పటి ఉద్యమాలు గుర్తొచ్చి దేశభక్తి ఉప్పొంగుతుంది. అవే ఇవి!

బారక్‌పూర్, పశ్చిమ్‌బంగ

ప్రథమ స్వాతంత్ర్య సమరం మొదలైంది ఇక్కడి నుంచే. తన కమాండర్లపై మంగళ్ పాండే తిరుబాటు చేస్తున్నట్టు ప్రకటించడంతో 1857 సిపాయిల తిరుగుబాటు ప్రారంభమైంది. బ్రిటిష్ పాలకులపై దాదాపు రెండు వందల ఏళ్లపాటు సాగిన పోరాటానికి ఇదే తొలిమెట్టు.

ఝాన్సీ, ఉత్తర్ ప్రదేశ్



రాణి ఝాన్సీ లక్ష్మీ బాయికి చెందిన ఈ నగరంలో సిపాయిల తిరుగుబాటు మరో మలుపు తిరిగి పాలకులపై యుద్ధంగా మారడానికి వేదికైంది.

చంపారన్, బిహార్



గాంధీజీ తొలి విజయానికి వేదిక ఇది. బ్రిటిష్‌వారు ఆహార ధాన్యాలకు బదులు వాణిజ్యపంటల్ని పండించమని బలవంతం చేశారు. గాంధీజీ భారత దేశానికి తిరిగొచ్చాక ఈ అంశంపై వ్యతిరేకిస్తూ చంపారన్ సత్యాగ్రహం నిర్వహించారు. ఇలా అహింసా ఉద్యమం మొదలైంది.



జలియన్ వాలా బాగ్, పంజాబ్

తెల్ల దొరల దురాగతానికి నిదర్శనంగా నిలిచిన ప్రాంతమిది. ఏప్రిల్ 13, 1919లో బ్రిటిష్ సైనికులు డయ్యర్ ఆధ్వర్యంలో అమాయక ప్రజలపై కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 379 మంది మరణించారు. 1200 మందికి పైగా గాయాల పాలయ్యారు.



చౌరీ చౌరా, ఉత్తర్ ప్రదేశ్

1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు ఈ ప్రాంతం వార్తల్లోకెక్కింది. పోలీసుల దౌర్జన్యాలపై ఆగ్రహించిన ప్రజలు చౌరీ చౌరా పోలీస్ స్టేషన్ని దహనం చేశారు. కొంతమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో గాంధీజీ ఆ ఉద్యమాన్ని నిలిపివేశారు.

కాకొరి, ఉత్తర్ ప్రదేశ్



ఉద్యమాల కోసం డబ్బు అవసరమయ్యింది. దీంతో 1925 ఆగస్టు 9న బ్రిటిష్ ప్రభుత్వం రవాణా చేస్తున్న నిధి నుంచి ఉద్యమకారులు ఎనిమిది వేల రూపాయల్ని లూటీ చేశారు. ఈ సంఘటన ప్రభుత్వాన్ని కలవరపెట్టింది. చరిత్రలో బ్రిటిష్‌వారి సంపద లూటీ జరగడం ఇదే ప్రథమం.

దండి, గుజరాత్



స్వాతంత్ర్య సమరంలో ముఖ్య ఘట్టమైన ఉప్పు సత్యాగ్రహం జరిగింది ఇక్కడే. 1930లో ఉప్పుపై పన్ను పెంచినందుకు నిరసనగా దాన్ని ప్రభుత్వ వ్యతిరేకతకు సాధనంగా గాంధీజీ ఈ ఉద్యమాన్ని నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పోరాటంపై బ్రిటిష్ వారి దృక్పథం మారడానికి ఇది ఎంతో దోహద పడింది.

చీరాల - పేరాల, ఆంధ్రప్రదేశ్




స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు వారి పోరాట పటిమకు చీరాల - పేరాల కేంద్రంగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిందిది. అసలు ఉద్యమం ఎలా వచ్చిందంటే... 1919లో బ్రిటిష్ ప్రభుత్వం (గతంలో గుంటూరు జిల్లా) ప్రకాశం జిల్లాలోని చీరాల-పేరాల గ్రామాలను కలిపి పురపాలక సంఘంగా చేయడంతో ప్రజలపై పన్నుల భారం అధికమైంది. ఈ రెండు గ్రామాల్లోని 15,000 జనాభా ఆదాయం నాలుగు వేల రూపాయలు. కానీ బ్రిటిష్‌వారు పన్నుల పేరుతో నలభైవేల రూపాయలు లాక్కునే ప్రయత్నాలు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ పురపాలక సంఘం రద్దు చేయాలని ప్రజలంతా ఉద్యమించారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో ఆందోళన మొదలుపెట్టారు. వేయి మంది సభ్యులతో 'రామదండు' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. విజయవాడ కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా గాంధీజీ వచ్చినప్పుడు సమస్యను ఆయనకు వివరించారు. మహాత్ముడు చీరాలను సందర్శించి ఊరు ఖాళీ చేస్తే మున్సిపాలిటీ దానంతట అదే రద్దవుతుందనే సూచన ఇచ్చారు. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలు ఊరు వదిలేసి పక్కనే ఉన్న ప్రదేశంలో 'రామ్‌నగర్' పేరుతో కొత్త నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. 11నెలల పాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉద్యమాన్ని కొనసాగించారు.

హాయ్! బుజ్జీ!!



ఎప్పుడూ నిజం మాట్లాడితే
కష్టాల్లో అందరూ మనకు
తోడుగా ఉంటారు
- గాంధీజీ

పదసంపద!



రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Pull = లాగు
- అపరాధం = తప్పు

నవ్వుల జల్లులు!




వనజ: దుస్తులుతకవే అంటే ఇంటికి తీసుకెళతానంటావేంటి?

పనిమనిషి: ఇప్పుడివి ఉతికే ఓపిక లేదమ్మా. మా ఇంట్లో వాషింగ్ మెషీన్‌లో వేసి తెస్తా!

- **పీవీ రమణకుమార్,** చిలకలూరిపేట



చిలిపి ప్రశ్న



నింగీ నేలా కలిసేదెప్పుడు?

- **కృష్ణవేణి,** విశాఖపట్నం


ఏమిటిది?

పదాల అమరికను బట్టి వచ్చే పదబంధాన్ని కనిపెట్టగలరా?



బొమ్మల్లో ఏముంది?

బొమ్మల ఆంగ్ల పేర్లు గడుల్లో రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ సందేశం వస్తుంది.

1 
2 
3 
4 
5 
6 
7 
8 
9 
10 
11 
12 
13 
14 
15 

జవాబులు: **బొమ్మల్లో ఏముంది:** 1. Bird 2. Nose 3. Dove 4. Bear 5. Jeep 6. Cave 7. Corn 8. Door 9. Tree 10. Neck 11.Cart 12. Gems 13. Hand 14. Ball 15. Yawn **దాగిన సందేశం:** INDEPENDENCE DAY **చిలిపిప్రశ్న:** కలిపి రాసినప్పుడు! **ఏమిటిది:** Get up and go

ప్రాణదాతలుగా నిలవాలి


రక్తదానం చేసిన వారికి గుర్తింపు పత్రాలను అందజేస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రాజారత్నం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవాలని తొర్రూరు ఆర్డీవో కె.కృష్ణవేణి, డీఎస్పీ రాజారత్నం కోరారు. దంతాలపల్లిలో లయన్స్‌క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వీరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి గుర్తింపు పత్రాలను అందజేశారు. మనం స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లయితే అది ఆపదలో ఉన్న వారి పాలిట వరంగా మారుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో యువత ముందంజలో నిలవాలన్నారు. ఈ శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.మహిపాల్‌రెడ్డి, సర్పంచి కిషన్, ఎంపీటీసీ సభ్యుడు కిశోర్, బాలవికాస సంస్థ మండల ప్రతినిధులు సుకన్య, శోభ, ఎస్సై వెంకటేశ్వర్లు, లయన్స్ బాధ్యులు అశోక్, లక్ష్మీనారాయణ, శ్రీను, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

పరకాల, న్యూస్‌టుడే: వరంగల్‌లోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పరకాలకు చెందిన పలువురు విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. గురుశోటోకాన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఆ పోటీలకు పలువురు విద్యార్థులు హాజరై పతకాలు సాధించినట్లు స్థానిక క్రియోటివ్ కరాటే-డూ క్లబ్ వ్యవస్థాపకులు మాడ సంపత్ తెలిపారు. సీనియర్ బాలికల స్పారింగ్‌లో బొగె ప్రసన్న ప్రథమ బంగారు, జూనియర్ విభాగంలో కూకట్ల అమల్యా ప్రథమ, జూనియర్ బాలుర విభాగంలో మాడ సాయిస్విగ్దిష్ బంగారు, కటాస్‌లో వెండి పతకాలు దక్కించుకున్నారు. సబ్‌జూనియర్స్ బాలుర స్పారింగ్‌లో పి.సాయితేజ, ముర్ర్యాల సిద్దు, కటాస్ విభాగంలో సహస్ర మాన్య, మహశ్రీ వరుసగా బంగారు, వెండి పతకాలు దక్కించుకోగా విజేతలకు ఆల్ ఇండియా శోటోకాన్ వ్యవస్థాపకులు ఇస్మాయిల్ బహుమతులను అందజేసినట్లు సంపత్ తెలిపారు. ఈ నెల 27న పరకాలలో క్రియోటివ్ కరాటే-డూ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మరుగు దొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి


వ్యక్తిగత మరుగుదొడ్ల పురోగతిని సమీక్షిస్తున్న డీఆర్‌డీవో గణేశ్

డోర్నకల్, న్యూస్‌టుడే: బహిరంగ మల విసర్జన రహిత గ్రామాల లక్ష్య సాధన అనేది ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్‌డీవో) వైవీ. గణేశ్ ఆకాంక్షించారు. మండలంలో ఈ లక్ష్య సాధనకు అతి చేరువలో ఉన్న తహసీల్దార్ బంజర గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. గ్రామస్థులతో సమావేశమయ్యారు. జిల్లాకు మూల ఉన్న గ్రామంలో 85 శాతం మేరకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావడం శుభపరిణామమని అభినందించారు. పురోగతిలో ఉన్న కట్టడాలను పరిశీలించారు. నిర్మాణం చేపట్టని వారితో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మిగతా 15 శాతం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుంటే తహసీల్దార్ బంజరను బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ప్రకటించే వీలుందని చెప్పారు. జిల్లాలో ఆగస్టు 15 నాటికి మండలానికి ఒకటి చొప్పున బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ప్రకటించాలని జిల్లా పాలనాధికారి సంకల్పించగా మరిపెడ మండలం బావోజీగూడెం, బీమరాజుపల్లి, కురవి మండలం కొత్తూరు(సి), తొర్రూరు మండలంలోని కర్కాల, గుర్తూరు, ఖానాపూర్ గ్రామ పంచాయతీలు ఈ ఘనతని సొంతం చేసుకున్నాయని వివరించారు. 2018 అక్టోబర్ 2 నాటికి బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా మహబూబాబాద్‌ని ప్రకటించడానికి సంసిద్ధులుగా ఉన్నామని తెలిపారు. అనంతరం ఆయన మొక్కలు పంపిణీ చేశారు

ఈటీవీలో ఈనాడు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈటీవీ ప్రత్యేక కార్యక్రమాలు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: కుజ, రాహు, కేతు గ్రహాలు అనుకూలించాలంటే... మంగళవారంరోజు ఏం చేయాలి?, ఆరోగ్యస్థితి వాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: స్పెషల్ ఈనాడు సినిమా: సర్దార్ పాపారాయుడు (ఎన్టీఆర్, శ్రీదేవి, శారద).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభిరుచి: సింగర్ దినకర్ అతిథిగా ముచ్చటించిన 'కొబ్బరి క్యారెట్ పలావు', మీఠేఠేవారు 'చాక్లెట్ కాఫీ', 'డ్రైఫ్రూట్ కస్టర్డ్ బిస్కెట్', జస్ట్ ఏ మినిట్ 'బేబీకార్న్ శాండ్‌విచ్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్పెషల్ స్టార్ మహిళ: 'లైట్ గేమ్ షో' సెలబ్రిటీ ఆర్టిస్ట్స్ స్పెషల్ ఎపిసోడ్..., 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (పార్ట్-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జబర్దస్త్ (రిపీట్), 05-30: జబర్దస్త్ జల్సా టైమ్ (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం), (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: వీర – చిన్నారుల టాలెంట్ షో..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 టాప్స్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 సినిమా చూపిస్త మావ రిపీట్

సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమ్మతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 హంగామా
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6:00, రా. 11.00)
★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30, రా. 7:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 10:30, 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
★ హెల్త్ & బ్యూటీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ. 3:00, సా. 4:00, రా. 09:00)
★ జీవనరేఖ – ఉమెన్స్ హెల్త్ (ఉ. 9:30, మ. 2:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్–అంతరంగం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్తీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: ధర్మయుద్ధం (రజనీకాంత్, శ్రీదేవి), 10-00: మార్నింగ్ షో: ప్రమీలార్జునీయం (ఎన్టీఆర్, బి.సరోజ), మధ్యాహ్నం: 1-00: మ్యాటినీ: చిత్రం భళారే విచిత్రం (నరేశ్, రాజీవి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఐ లవ్ ఇండియా (శరత్‌కుమార్, ప్రియారామన్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: రాజసింహ (రాంతారావు, వాణిశ్రీ), 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ అభిరుచి

ఇండిపెండెన్స్ డే స్పెషల్స్

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ట్రై కలర్ కేసరి, స్వీట్ కార్న్ అండ్ క్యారెట్ రైస్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో – ఫ్రూట్ అండ్ నట్ ప్యాన్ కేక్, ట్రై కలర్ స్వీట్ బేసిల్ దోస (ఇన్‌స్పెక్టర్ మాధవిలత), ఉ.10.00: ఆహారవీధిలో – ప్రోజెస్ డెసెర్ట్ - ఎన్.యమ్.రాజేశ్వరి - ఫౌండర్ ఆఫ్ "తోడు నీడ" ఆర్గనైజేషన్, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – తిరంగా పూరీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – జండా దోశ శశికళ స్వామి సోషల్ వర్కర్, ఉ.11.30, రా.8.00: బాబాయ్ హోటల్ - బాదుషా, సింగర్ సాహితి, మ.12.00: బెస్ట్ ఆఫ్ ఇండియా - ట్రై కలర్ పేడ - సీవ ధనలక్ష్మి, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ - తిరంగా ఇడ్లీ - సింగర్ ధనుంజయ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - సపోటా లడ్డు, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ట్రై కలర్ పనీర్ టిక్కా, మ.1.00: వావ్ ఏమి రుచి (స్వాతంత్ర్య స్పెషల్) – తిరంగ పన్నీర్ స్క్యూవర్స్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - తిరంగా కోకోనట్ స్వీట్ - జ్ఞానప్రసూనా - సోషల్ వర్కర్, మ.1.45: ట్రెండీ ట్రీట్స్ – ట్రై కలర్ చిప్స్, మ.2.15: డిజైనర్ డిష్ - గిల ఫిలోస్ - సిఐడి ఆఫీసర్ - ఉషశ్రీ, మ.2.30: చోటా చెఫ్ – ట్రై కలర్ ఖీర్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 మంతారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ౦, 08-30 యువ (రిపీట్), 09-00 మంతారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 మంతారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 మంతారావం, 12-30 కమర్షియల్ స్పెషల్, 01-00 ఈటీవీ 360౦, 02-00 సఖి, 02-30 మంతారావం, 02-35 సఖి, 03-00 మంతారావం, 03-30 సుఖీభవ, **సాయంత్రం:** 04-00 మంతారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ రాధారాస విహారీజీ మందిరం, జుహూ, ముంబయి, 5-00 మంతారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 మంతారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 మంతారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ౦.09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 మంతారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 మంతారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ౦, 08-30 యువ (రిపీట్), 09-00 మంతారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్),10-00 మంతారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 మంతారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 మంతారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ౦. 02-00 సఖి, 02-30 మంతారావం, 02-35 సఖి, 03-00 మంతారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రాధాగోవిందజీ మందిరం, జైపూర్, రాజస్థాన్, **సాయంత్రం:** 04-00 మంతారావం, 04-30 సుఖీభవ, 05-00 మంతారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 మంతారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 మంతారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ౦. 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 మంతారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు

1. వర్షాకాలంలో చేపల చెరువుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు
2. వేరుశనగను ఆశించే చీడపీడలు - నివారణ
3. కందిలో పోషకాల యాజమాన్యం, సస్యరక్షణ

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

జైకిసాన్‌లో... నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. మిషన్ కాకతీయ నిధులు స్వాహా - వరద కాల్వను చెరువుగా చూపారని రైతుల ఆరోపణ
2. పందిళ్ల కింద మిరప సాగు- ఏకకాలంలో రెండు పంటలంటున్న సాగుదారులు

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

పొద్దుతిరుగుడులో తెగుళ్ల యాజమాన్యం

పొద్దుతిరుగుడు పంటను ఆశించే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులను నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు తోట శ్రీనివాసరావు వివరించారు.

నెక్రోసిస్ తెగులు: ఈ తెగులు పంటను అన్ని కాలాల్లో ఏ దశలోనైన ఆశిస్తుంది. ఇది వైరస్ వల్ల వచ్చే తెగులు, తామరపురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన పుడు ఆకుల మధ్య ఈనె దగ్గరగా ఉండే భాగం నల్లగా మారి, మాడిపోయి ఆకులు వంకరలు తిరిగి ఎండిపోతాయి. తెగులు ఆకు కాడకు, కాండానికి, పువ్వుకు వ్యాపించటం వలన ఆయా భాగాలు నల్లగా మాడి ఎండిపోతాయి. మొక్క సరిగా ఎదగక గిడసబారిపోతుంది. పుష్పం సరిగా విచ్చుకోక మెలి తిరుగుతుంది. పుష్పభాగం దెబ్బతిని విత్తన వృద్ధి జరుగదు. దిగుబడి తగ్గుతుంది.

యాజమాన్యం: వేసవి దుక్కులు చేయాలి. పంట చుట్టు నాలుగు సాళ్లు జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలు వేయాలి. కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసి, తొలిదశలో తామరపురుగు ఆశించకుండా నివారించవచ్చు. పొలంగట్ల మీద వయ్యారి భామ కలుపు మొక్కలను, పొలంలో తెగులు సోకిన పంట మొక్కలను పూత రాక ముందే పీకివేసి కాల్చివేయాలి. లీటరు నీటికి మెటాసిస్టాక్స్ 2 మి.లీ. లేదా 15 లీటర్ల నీటికి ఇమిడాక్లోప్రిడ్ 6 మి.లీ. కలిపి 15 రోజులకొకసారి 3 లేదా 4 సార్లు పిచికారి చేయాలి.

ఆకుమచ్చ తెగులు: పొద్దుతిరుగుడు సాగు చేసిన 50-60 రోజుల వరకు ఈ తెగులు ఆశిస్తుంది. ముదురు గోధుమ, నల్లటి, గుండ్రని లేదా అండాకారపు మచ్చలు మొదట ఆకులపై ఏర్పడి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకు అంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. ఈ తెగులు లక్షణాలు ఆకుల పైనే కాకుండ పత్రవృంతం, కాండం, పువ్వు వెనుక ఉండే ఆకుపచ్చని భాగాలపై ముదురుగోధుమ లేదా నలుపురంగు మచ్చల వలె కన్పిస్తాయి. తెగులు సోకిన పుష్పాలు కుళ్లిపోయే అవకాశం ఉంది. అందువల్ల గింజ నాణ్యత తగ్గి మొలకశాతం తగ్గుతుంది.



యాజమాన్యం: కిలో విత్తనానికి 2 గ్రా. ఇప్రోడైన్+కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంటపై తొలిదశలో వ్యాధిని గుర్తించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. ఇప్రోడియన్+కార్బండిజమ్ లేదా 1 మి.లీ. ప్రోపికొనజోల్ కలిపి 15 వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి.

బూడిద తెగులు: ఆకుల పైన అడుగుభాగాన బూడిద లాంటి పొడితో కప్పబడిన చిన్న మచ్చలు ఏర్పడి క్రమేపి ఆకు అంతా బూడిద లాంటి పొడితో కప్పబడి ఉంటుంది. తెగులు తీవ్రత ఎక్కువైతే ఆకులు పసుపు రంగు లోకి మారి రాలిపోతాయి.

యాజమాన్యం: లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం పొడి లేదా 1 మి.లీ. డైనోక్యాప్ కలిపి పిచికారి చేయాలి.

తుప్పు తెగులు: చలికాలంలో ఈ తెగులు తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ తెగులు మొదట కింది ఆకులపై చిన్న ఇటుక వర్ణపు పొక్కులుగా ఏర్పడి క్రమేపి పైఆకులకు, పుష్పం లోని పచ్చని భాగాలకు వ్యాపిస్తుంది. తెగులు తీవ్రత ఎక్కువైన పుడు వ్యాధి సోకిన భాగాలు తుప్పు వర్ణం లోకి మారి ఎండిపోతాయి.

యాజమాన్యం: థైరామ్ లేదా కాప్టాన్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. మ్యాంకోజెబ్ 3 గ్రా. లేదా 2 గ్రా. జినెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

తలకుళ్లు లేదా పువ్వుకుళ్లు: ఈ తెగులు ఎక్కువగా పూతదశలో వర్షాలు పడినప్పుడు ఆశిస్తుంది. తెగులు సోకిన పువ్వు కింది భాగం నీటిలో తడిసినట్లుండి తరువాత గోధుమరంగుకు మారుతుంది. ఈ భాగంపై దూదిపింజ లాంటి శిలీంద్రం పెరుగుతుంది. ఇది పువ్వు అంతా వ్యాపించి పువ్వు కుళ్లిపోయి గింజలు నల్లటి పొడి ముద్దగా మారతాయి.

యాజమాన్యం: లీటరు నీటికి మెటలాక్సిల్ 1 గ్రా.+ నీటిలో కరిగే గంధకం 3 గ్రా. కలిపి 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.

బూజుతెగులు: ఈ తెగులు సోకిన ఆకులు ఈనెల మధ్య పత్రహరితం కోల్పోయి లేత పసుపురంగు లోకి మారుతుంది. ఈనెలు ఉబ్బి ఆకులు కిందకు ముడుచుకొని ఉంటాయి. పుష్పాలు వంధ్యత్వంగా మారి నిటారుగా ఉంటాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి గిడసబారుతాయి.

యాజమాన్యం: మెటలాక్సిల్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంటపై మెటలాక్సిల్ (8 శాతం) 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

–న్యూస్‌టుడే, దుగ్గొండి.

కాలుష్య రహితుడు..
పర్యావరణ హితుడు..!

● మట్టి గణేశులకు జై కొడదాం..! ● నగరంలో జోరుగా తయారీ


రథారూఢుడు.. గణనాథుడు..

గణనాథుని వేడుకకు నగరం సిద్ధమవుతోంది. గణపయ్య ప్రతిమలు ఎక్కడికక్కడే కొలువుదీరుతున్నాయి. చూడచక్కని రూపాల్లో కంటికింపైన అలంకరణల్లో పార్వతీ తనయుడు సరికొత్తగా రూపుదిద్దుకుంటున్నాడు. ఈనెల 25న వినాయక చతుర్థి వేడుకలకు నగరంలోని పలు ప్రాంతాల్లో అప్పుడే సందడి మొదలైంది. పర్యావరణ హితుడైన హేరంబుడిని ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే ముడిసరకులతోనే తీర్చిదిద్దుతున్నారు. వరంగల్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో మూడు నెలలుగా వివిధ రూపాల్లో మట్టితో గణనాథులను తయారు చేస్తున్నారు. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు రాత్రింబవళ్లు పార్వతీ తనయునికి అలంకరణలు చేస్తూ వేడుకలకు ముస్తాబుచేస్తున్నారు. పూర్తిగా మట్టి, గడ్డి, సహజసిద్ధమైన రంగులతోనే విగ్రహాలను తయారుచేస్తున్నట్లు నిర్వాహకులు దర్శన్‌సింగ్ చెప్పారు. ఎనుమాముల మార్కెట్ సమీపంలో ఒడిశా, మహారాష్ట్ర నుంచి వచ్చిన కళాకారులు విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకునే గణపతులను తయారుచేస్తున్నారు. స్థానికంగా 60 ఏళ్లుగా విగ్రహాలను తయారుచేస్తున్నట్లు నిర్వాహకులు భిక్షపతి తెలిపారు. నిమజ్జన సమయంలో నీటిలో తక్షణమే కలిసిపోయేలా కాలుష్య రహిత వర్ణాలను మాత్రమే వాడుతున్నట్లు వివరించారు.

– చిత్రాలు: ఈనాడు, వరంగల్


గణపయ్య కిరీటానికి మెరుగులు


లంబోదరునికి అలంకరణలు


బాలకృష్ణుని రూపంలో గణేశునికి రంగులు


రూపుదిద్దుకుంటున్న కాణిపాకం వినాయకుని రూపం..

రేపటి నుంచి రైలు పక్వాడ స్వచ్ఛత కార్యక్రమాలు

రైల్వేస్టేషన్ (శివనగర్), న్యూస్‌టుడే: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఈనెల 16 నుంచి 31 వరకు రైలు పక్వాడ స్వచ్ఛత కార్యక్రమాల్ని నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛత ప్రమాణాలను పెంచుతామని ఈనెల 16న ఉదయం ప్రతిజ్ఞ చేస్తామని, ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డీఈఈ శివప్రసాద్ హాజరవుతారని వివరించారు. 15 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో రోజూ ఒక అధికారి స్టేషన్‌లో ప్రయాణికులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తారని, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు, రైళ్లలో సౌకర్యాలపై అభిప్రాయాలు సేకరిస్తారని వెల్లడించారు. స్టేషన్ పరిసరాలు, ఆవరణను పరిశుభ్రంగా ఉంచడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రయాణికుల భాగస్వామ్యంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: పోలీస్ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ తిరుమల్ తెలిపారు. కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు యువతను ప్రోత్సహించేందుకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆసక్తిగల క్రికెట్ జట్లు ఈనెల 17వ తేదీలోపు కెప్టెన్ ఆధార్ కార్డుతో వచ్చి పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. ముందుగా పోలీసుస్టేషన్‌ల వారీగా పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన జట్లను ఎంపికచేస్తామన్నారు. తర్వాత కమిషనరేట్ స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

ఆందోళన రేపుతున్న ఆడిట్ నివేదిక

☛ అభ్యంతరాలపై తాఖీదులు సిద్ధం

☛ కమిషనర్‌కు చేరిన వివరాలు

రామన్నపేట, న్యూస్‌టుడే

వరంగల్ అవిభక్త జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ఇటీవల చేపట్టిన ఆడిటింగ్ దేవాదాయ శాఖ వర్గాల్లో ఆందోళన రేపుతోంది. రెవెన్యూ శాఖకు చెందిన ఆడిటర్ జేడీలక్ష్మినారాయణ పేరు వింటనే అధికారులు, సిబ్బంది హడలిపోతున్నారు. దాదాపు రెండు వారాల పాటు ప్రధాన దేవాలయాల్లోని ఆదాయ, వ్యయాల చిట్టాలను ఆయన పరిశీలించి లోటుపాట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తన పరిశీలన పూర్తయిన నేపథ్యంలో దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదికను పంపారు. ఈ నివేదిక ఆధారంగా కమిషనర్ సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి వివరణ కోరేందుకు తాఖీదులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆలయాలకు రెండు మూడు రోజుల్లో తాఖీదులు చేరనున్నాయి. ఈ సమాచారం దేవాదాయ శాఖలో గుబులు రేపుతోంది.

సాధారణంగా ఆలయాల్లో రెండు రకాలుగా ఆడిట్ జరుగుతుంది. ముందుగా లోకల్ ఆడిటింగ్, తర్వాత డిపార్టుమెంటల్ ఆడిటింగ్ చేస్తారు. ఈ రెండు పద్ధతుల్లో రికార్డుల పరిశీలన ఉంటుంది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ దేవాలయాల్లో డిపార్టుమెంటల్ ఆడిట్ కోసం రాష్ట్ర ఆర్థిక శాఖకు చెందిన ఐదుగురు రెవెన్యూ అధికారులను రంగంలోకి దించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు రెవెన్యూ అధికారి లక్ష్మినారాయణ రెండు వారాల క్రితమే వచ్చి తన పని పూర్తిచేసుకుని వెళ్లారు. దేవాదాయ శాఖ అధీనంలో కొనసాగుతున్న ఆలయాల్లో అంతులేని అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని కొంతకాలంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇవన్నీ నిజమే అన్నట్లుగా ఆడిట్‌లో తేలింది. మేడారం, భద్రకాళి, ఐనవోలు, కురవి దేవాలయాల్లో సూక్ష్మస్థాయిలో రికార్డులను పరిశీలన చేశారు. దేవస్థానం అధికారులు, ఉద్యోగులు రాసిన రికార్డులను అణువణువునా స్కాన్ చేశారు. చిన్నా చితకా తప్పులుంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. పెద్దఎత్తున జరిగిన అక్రమాలను నోట్ చేసుకొని నివేదిక తయారుచేసి కమిషనర్‌కు పంపించారు. ఐనవోలు, కురవి దేవస్థానాల్లో రికార్డులు సరిగా లేవని గుర్తించారు. అభివృద్ధి పనులు, ప్రసాదాల తయారీ, ముడిసరకులు, విక్రయల ఆదాయం తదితర వివరాలు పారదర్శకంగా లేవని గుర్తించారు. నిబంధనల ప్రకారం ఎలా ఉండాలి? ఆలయం ఉద్యోగులు ఏ విధంగా వ్యవహరించారనే విషయాలను పక్కా ఆధారాలతో సహా నివేదించారు. ఆడిటర్ గుర్తించిన అభ్యంతరాలకు దేవాలయాల కార్యనిర్వహణ అధికారులు తగిన సమాధానం చెప్పాలి. వారి వివరణ సరిగా లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి వచ్చే తాఖీదులకు సరైన సమాధానం చెప్పాల్సిందేనని ఇప్పటికే దేవాదాయ శాఖ వరంగల్ ప్రాంతీయ ఉప కమిషనర్ రమేశ్‌బాబు తేల్చి చెప్పారు.

వేద పండిట్ వేతన బకాయిలు స్వాహా..

ఐనవోలు దేవాలయంలో పనిచేస్తున్న వేదపండిట్ వేతన బకాయిలను స్వాహా చేసినట్లుగా ఆడిటింగ్‌లో తేలింది. దీనికి సంబంధించిన వివరాలన్నీ ఆడిటర్ లక్ష్మినారాయణ రికార్డు చేసి దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. దీంతోనే అసలు గొడవ మొదలైనట్లుగా తెలిసింది. గట్టు పురుషోత్తమ్‌శర్మ 2010 నుంచి కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న 10 మంది వేద పండిట్‌ల సేవలను క్రమబద్ధీకరించారు. ఇందులో ఐనవోలులో పనిచేస్తున్న పురుషోత్తమ్‌శర్మ రెగ్యులర్ అయ్యారు. ఈయన వేతన బకాయిలను అతనికి తెలియకుండానే ఆలయ ఉద్యోగులు వరంగల్ మహా నగరంలోని ఓ బ్యాంకు నుంచి డ్రా చేశారు. ఈ విషయం ఆడిటర్ లక్ష్మినారాయణ రికార్డుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. దాదాపు రూ.1.80 లక్షలను ఓ ఉద్యోగి బ్యాంకు అధికారులను నమ్మించి డ్రా చేసినట్లుగా గుర్తించారు. ఆడిటర్ సంబంధిత వ్యక్తిని పిలిచి మాట్లాడే వరకు ఈ విషయం వేదపండిట్‌కు తెలియలేదని తెలిసింది. ఇదే విషయంపై 'న్యూస్‌టుడే' పురుషోత్తమ్‌శర్మతో మాట్లాడగా వేతన బకాయిలను నాకు తెలియకుండానే డ్రా చేసినట్లు ఇటీవలే తనకు తెలిసిందని వివరించారు. ఆడిటర్ తన డబ్బులు తిరిగి ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని తెలిసింది.

'ఈనాడు' కథనాలపై ఆరా..

వరంగల్ అవిభక్త జిల్లాల్లోని మేడారం, భద్రకాళి, ఐనవోలు, కురవి దేవాలయాల్లో జరిగిన ఆడిటింగ్‌లో వెలుగు చూసిన అక్రమాలను 'ఈనాడు' నగర పత్రికలో వరుస కథనాలుగా ప్రచురించడంతో దేవాలయాల్లో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించినట్లు తెలిసింది. నిఘా వర్గాల ద్వారా దేవస్థానాల వారీగా పూర్తి వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. వరంగల్ మహా నగరంలో దేవాదాయ శాఖ ప్రాంతీయ, సహాయ కమిషనర్ కార్యాలయాలు ఉన్నాయి. ఉప కమిషనర్, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఇంత మంది అధికారులున్నప్పటికీ అక్రమాలను నిలువరించకపోవడం చర్చనీయాంశంగా మారింది. దేవాలయాల్లో జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడే ఇలా జరిగిందని తెలిసింది. మరోవైపు అక్రమాలకు పాల్పడుతున్న వారికి కొందరు వత్తాసు పలుకుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.